

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యతనిస్తోంది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో పోలవరం పూర్తి, పరిశ్రమల పునరాగమనం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



మంగళవారం 25.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 125 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00







# 'లోకల్' పంటలకు.. గ్లోబల్ మార్కెట్!

- ఫుడ్ ప్రాసెసింగ్‌తో ఉత్పత్తులకు విలువ జోడించే దిశగా కార్యాచరణ
- పాప్‌కార్న్ నుంచి కాఫీ, కోకో వరకు అంతర్జాతీయ బ్రాండ్లుగా తీర్చిదిద్దే లక్ష్యం
- రైతులను ఎంటర్‌ప్రెన్యూర్లుగా మార్చడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం

**నూజివీడు(జర్నలిస్ట్ ఫైల్) :** మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స్ పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..." రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్కజొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్కజొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్

2లో






## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

- పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో వేగంగా పనులు
- 1,111 కి.మీ. పైప్‌లైన్‌లో 1,106 కి.మీ. నిర్మాణం పూర్తి
- పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురంలో పూర్తయిన పనులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జల్ జీవన్ మిషన్–అమరజీవి జలధార కింద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళ్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

**గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం:** ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో

మిగతా 2లో...

## శాఖల్లో సమర్థత - సేవల్లో నాణ్యత

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం డేటా ఇంటిగ్రేషన్
- డెంగీ, మలేరియా నివారణకు హాట్‌స్పాట్‌ల గుర్తింపు
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏఐ అసిస్టెంట్, డిజి వెరిఫై, డేటా లేక్, బ్లాక్ చెయిన్... వంటి సాంకేతికతను వినియోగించుకుని ఆన్‌లైన్ సేవలు మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఏ ఒక్కరూ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే పని లేకుండా సేవలు అందించాలన్నారు. ప్రస్తుతం వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర ద్వారా అందిస్తున్న 1,204 సేవలకు సంబంధించి డేటా ఎంట్రీ సమాచారాన్ని మరింత సంక్షిప్తం చేయాలన్నారు. సర్టిఫికేట్స్ అప్‌లోడ్ చేసే పని లేకుండా డేటా ఇంటిగ్రేషన్ జరగాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ సమీక్షలో వివిధ శాఖల పనితీరు, పురోగతి గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖలు మరింత సమర్థత పెంచుకోవాలని, నాణ్యమైన సేవలు

మిగతా 2లో...

## పోస్టల్ సేవలకు.. స్మార్ట్ టచ్!



- పార్సిల్, పికప్, బ్యాంకింగ్, యూపీఐ సేవలు ఇక యాప్‌లోనే
- 40 పోస్టాఫీసుల ఆధునీకరణ పూర్తి.. మరో 110కు అప్‌గ్రేడ్
- మారుమూల ప్రాంతాలకూ డిజిటల్ పోస్టల్ సేవల విస్తరణ

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఢిల్లీలో పోస్టల్ సేవలను మరింత ఆధునికంగా.. సులభంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక కార్యక్రమాలను ప్రారంభించింది. కేంద్ర మంత్రులు జ్యోతిరాదిత్య సింధియా, డా. పెమ్మసాని చంద్రశేఖర్ 'డాక్ సేవా', 'డాక్ మిత్ర' యాప్‌లతో పాటు

మిగతా 2లో...

## స్థానిక ఎన్నికల షెడ్యూల్... ఫేక్



- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న తేదీలపై ఎస్ఈసీ క్లారిటీ
- అధికారిక లోగోలతో నకిలీ ప్రచారం.. నమ్మొద్దని హెచ్చరిక
- ఫేక్ షెడ్యూల్ సృష్టించిన వారిపై కఠిన చర్యలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో జరగనున్న గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న షెడ్యూల్ పూర్తిగా నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనీల్‌చంద్రపునేతా స్పష్టం చేశారు. అధికారిక ప్రభుత్వ గుర్తులను సైతం దుర్వినియోగం చేస్తూ

మిగతా 2లో...

## కేరళ 'కుట్టి'కి.. యూనివర్స్ కిరీటం!

- 19 ఏళ్ల లా విద్యార్థిని కాజియా లిజ్ మెజో సరికొత్త ఘనత
- మోడలింగ్, సంగీతం, నృత్యం, నటనలోనూ ప్రతిభ
- మిస్ యూనివర్స్ 2026లో భారత్‌కు ప్రాతినిధ్యం

2లో




## రాష్ట్ర ప్రగతే.. చంద్రబాబు ప్రాధాన్యం!

- చంద్రబాబు పాలనా దక్షతపై ఉపరాష్ట్రపతి ప్రశంసలు
- రాష్ట్ర ప్రగతికి అత్యంత ప్రాధాన్యమిచ్చే నాయకుడంటూ కితాబు
- రైతులే దేశానికి వెన్నెముక అని వ్యాఖ్య



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు. ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్–జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ

మిగతా 2లో...

## సౌజన్యపై మతమార్పిడి ఒత్తిడి!



- సూసైడ్ నోట్ల ఆధారంగా సాధిక్‌ఖాన్‌పై కేసు నమోదు
- పరారీలో ఉన్న నిందితుడిని యూపీలో అరెస్టు చేసిన 10 పోలీసు బృందాలు
- 14 రోజుల రిమాండ్.. పోలీసు కస్టడీకి పిటిషన్‌కు సిద్ధం

**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసులో దర్యాప్తు కొనసాగుతోందని కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. నూకరాజు, ఆయన కుమార్తె సౌజన్య వేర్వేరుగా రాసిన సూసైడ్ నోట్‌లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ రెండింటిలోనూ రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్‌ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొనడంతో అతడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

"ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరిలో దూకారు. రియాన్స్ ప్రాణాలతో బయటపడగా మిగిలిన ముగ్గురు మృతిచెందారు. రాజమహేంద్రవరంలో తొలుత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. నూకరాజు వద్ద,

మిగతా 2లో...

## కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్



**హైదరాబాద్ (జర్నలిస్ట్ ఫైల్) :** వైకాపా నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు హైదరాబాద్ ఈడీ కోర్టు 2 వారాల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో నిందితుడిగా ఉన్న కారుమూరిని ఈడీ అధికారులు ఆదివారం కొండాపూర్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వైద్య పరీక్షలు చేయించిన ఈడీ అధికారులు కారుమూరిని

మిగతా 2లో...

## గోదావరి తీరానికి పర్యాటక వైభవం

- అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుతో కొత్త ఆకర్షణలు
- శెట్టిపేటలో బోటింగ్ పాయింట్, వే-సైడ్ రెస్టారెంట్, ప్లే జోన్
- హేవలాక్ బ్రిడ్జి అభివృద్ధి.. పుష్కర్ ఘాట్ పునర్నిర్మాణం



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి పరివాహక ప్రాంతంలో పర్యాటక శోభను పెంపొందించాలనే లక్ష్యంతో చేపట్టిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపడుతున్న ప్రాజెక్టులో భాగంగా నిడదవోలు మండలం శెట్టిపేటలో

మిగతా 2లో...

## స్పెషల్ టెట్ నోటిఫికేషన్ విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఇన్–సర్వీస్ ఉపాధ్యాయులకు 'స్పెషల్ టెట్' నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ సోమవారం విడుదల చేసింది. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ల స్వీకరిస్తామని వెల్లడించింది. అధికారిక వెబ్‌సైట్ http://cse.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రతి పేపర్‌కు రూ. 1000 అప్లికేషన్ ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపింది. అక్టోబర్ 5వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్ష రూపంలో స్పెషల్ టెట్ నిర్వహిస్తామని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. ఉపాధ్యాయుల సర్వీసులో కొనసాగింపుతోపాటు ప్రమోషన్లకు మాత్రమే ఈ టెట్ వర్తిస్తుందని స్పష్టం చేసింది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు ఈ స్పెషల్ టెట్ వర్తించదని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే వారికి ఏమైనా సందేహాలు ఉంటే.. ఈ హెల్ప్‌డెస్క్ నంబర్లు 8121947387, 7995649286, 6281704160 కాల్ చేయాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)

రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ చూపలేదు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కూడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కూటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కూడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కూడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కూడా దాదాపు తుది దశకు చేరింది. కూటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

## శాఖల్లో సమర్థత - సేవల్లో నాణ్యత

(మొదటి పేజీ తరువాయి)

అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

**క్రాప్ అలర్ట్‌లపై పర్యవేక్షణ :** ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల పరిస్థితిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈసారి వ్యవసాయ దిగుబడులు సాధారణం కన్నా 20 శాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా కృష్ణా డెల్టాకు సెప్టెంబర్ నెలాఖరు వరకు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు అందించగలమని చెప్పారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు సమృద్ధిగా నీరందించేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే సాగు మొదలు పెట్టని చోట వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ప్రోత్సహించాలని నిర్దేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు క్రాప్ అలర్ట్ పంపడంతో పాటు దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఇందుకోసం ఏపీటీఎస్ అనలిటిక్స్ కూడా వినియోగించుకుని... అవేర్‌తో సమన్వయం చేసుకోవాలని సీఎం అన్నారు. తాగునీటి వరకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పారు. అటు మలేరియా, డెంగీ కేసుల నివారణకు హాట్ స్పాట్ లు గుర్తించి, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. అయితే గత ఏడాది ఇదే సమయానికి 1,361 డెంగీ కేసులు నమోదైతే... ఈ ఏడాది ఇప్పటికి 401 కేసులు నమోదైనట్టు అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో కార్బన్ న్యూట్రల్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే రెన్యువబుల్ ఎనర్జీపై ఎక్కువ దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. సోలార్ రూఫ్ టాప్‌లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

## కేరళ ‘కుట్టి’కి.. యూనివర్స్ కిరీటం!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కేరళకు చెందిన 19 ఏళ్లలా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో ‘మిస్ యూనివర్స్ ఇండియా 2026’ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. దీంతో నవంబర్‌లో పోర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున ఆమె బరిలోకి దిగనున్నారు. కేరళ నుంచి **జాతీయ స్థాయికి.. :** కాజియా స్వస్థలం కేరళ అయినప్పటికీ ఆమె బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో ఆమె విద్యాభ్యాసం సాగింది. పేజెంట్రీతో పాటు కాజియాకు కళలపై కూడా ఆసక్తి ఉంది. 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గాయని, సంగీత కళాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. పబ్లిక్ స్పీకింగ్, నటనలోనూ అనుభవం ఉంది. మలయాళ చిత్రం ‘షైలాక్’ ద్వారా నటిగా కూడా అరంగేట్రం చేశారు.

కేరళకు చెందిన కాజియా ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్‌ను గెలుచుకున్నారు. అనంతరం 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరిగిన మిస్ యూనివర్స్ కేరళ 2026 పోటీల్లో విజేతగా నిలిచి.. ఆ టైటిల్‌ను గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏకంగా మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని దక్కించుకోవడం విశేషం.

**జైపూర్‌లో హోరాహోరీ పోటీ.. :** మిస్ యూనివర్స్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులు పోటీ పడగా.. కజియా లిజ్ మేజో విజేతగా నిలిచారు. తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా అనుశ్రీకి మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ కూడా దక్కింది. ఈ ఫినాలేకు మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో పాటు మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు జడ్జీలుగా వ్యవహరించారు.

## కారుమూరికి జ్యుడీషియల్ రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కోర్టులో హాజరుపర్చారు. కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్టు అయ్యారు. వారిలో కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్, ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డి ఉన్నారు. లిక్కర్ రవాణా టెండర్లలో సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్‌ను ఫ్రంట్ కంపెనీగా ఉపయోగించినట్లు అనుమానిస్తోంది. ఈ కేసులో హవాలా లావాదేవీలపైనా ఈడీ దర్యాప్తు ముమ్మరం చేసింది.

**ఈడీ రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు :** కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్ లిక్కర్ రవాణా సిండికేట్‌కు ప్రధాన లబ్ధిదారులు. రాజకీయ పలుకుబడితో లిక్కర్ రవాణా సబ్ కాంట్రాక్టులు ఇప్పించారు. శ్రీ సుదర్శన కన్‌స్ట్రక్షన్స్‌ను డమ్మీ సబ్ కాంట్రాక్టర్‌గా ఏర్పాటు చేశారు. సిగ్మా సప్లై చైన్స్ సొల్యూషన్స్ ద్వారా రవాణా కాంట్రాక్ట్ పొందారు.. అసలు రవాణా పనులు ఇతర వ్యక్తులు చేశారు. లిక్కర్ రవాణా ద్వారా వచ్చిన అక్రమ సొమ్మును పలు బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించారు.కారుమూరి, ఆయన కుమారుడు కలిసి రూ.18.09 కోట్ల అక్రమ ఆదాయాన్ని ఆర్జించారు.

# ‘లోకల్’ పంటలకు.. గ్లోబల్ మార్కెట్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది.” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



**ప్రాసెసింగ్ పెరిగితేనే ఉత్పత్తులకు విలువ :** “ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రాడెక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలి. నూజివీడు వద్ద ఇప్పుడు పామాయిల్, కోకో ఆక్వా లాంటి వాణిజ్య పంటలు పెరిగాయి. వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటల్లో మనం అగ్రగామిగా మారాం. వచ్చే 20-30 ఏళ్లలో ఎలాంటి పంటలు ఉండాలి, ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో మనం నిర్దేశించు కుందాం. రాయలసీమను కూడా ఉద్యాన పంటల హబ్ గా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. రూ. 1 లక్ష కోట్ల వ్యయంతో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. రూ. 35 వేల కోట్లతో 36 సాగు ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉన్నా గోదావరి నీటిని కృష్ణా డెల్టాకు తరలించి పంటలను కాపాడాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తే ఈ ప్రాంత భవిష్యత్తు కూడా మారుతుంది. వెలిగొండ ప్రాజెక్టు ను ఈ నెలాఖరులోనే ప్రారంభించి మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాకు నీరు ఇస్తాం. ఎల్ నినో వల్ల నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంది. పప్పు ధాన్యాల లాంటి ప్రత్యామ్నాయ పంటలు వేసేలా చర్యలు చేపట్టాం. రైతులు కూడా సహకరించి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తున్నాను. నీటి భద్రత సాధించి ప్రతి ఎకరాకూ నీరు ఇచ్చేలా చర్యలు చేపడతాం. దేశం అంతా నదుల అనుసంధానం జరిగి నీటి సద్వినియోగం జరగాలన్నది ఎన్డీఏ ప్రభుత్వ ఆలోచన. గోదావరి- కృష్ణా, తుంగభద్ర, పెన్నా- కావేరీ నదులను అనుసంధానించటం ద్వారా 4 రాష్ట్రాల్లో సమస్య పరిష్కారం అవుతుంది. కష్టకాలంలో అన్ని ప్రాంతాల్లో ఆయకట్టు స్థిరీకరణ, తాగునీరు అందించే అవకాశం ఉంటుంది. గంగా, మహానది, గోదావరి నదుల్ని కూడా అనుసంధానించుకుంటే వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకోగలం. అప్పుడు దేశానికి తిరుగులేదు. నీటి భద్రత సాధిస్తే దేశ అభివృద్ధి అన్‌స్టాపబుల్.” అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నారాలోకేష్, కె. అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్ర ప్రగతే.. చంద్రబాబు ప్రాధాన్యం!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. “రెండు నెలల క్రితం ‘దినమలర్’ అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను” అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.



ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. “మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది” అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# గోదావరి తీరానికి పర్యాటక వైభవం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న పనులను సోమవారం మంత్రి పరిశీలించారు.

అధికారులతో కలిసి పనుల నాణ్యతను, డిజైన్ ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం నిర్మాణాలు జరుగుతున్న తీరును మంత్రి పరిశీలించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శెట్టిపేట గోదావరి కెనాల్ తీరంలో పర్యాటకులు ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరేలా బోటింగ్ పాయింట్, వే-సైడ్ రెస్టారెంట్, చిన్నారుల కోసం ఆధునిక ప్లే జోన్, చినకాశీరేవు ఘాట్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రాజమహేంద్రవరంలోని చారిత్రాత్మక హేవలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేయడంతో పాటు పుష్కర్ ఘాట్ పునర్నిర్మాణం, కడియం నర్సరీల వద్ద



ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. శెట్టిపేట పర్యాటక ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాథమిక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మిగిలిన పనులన్నీ పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం, నిడదవోలు, కొవ్వూరు తదితర ప్రాంతాల్లోని ఘాట్లను పర్యాటకులు, భక్తులకు ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు ప్రాజెక్టుకు మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు మంత్రి కందుల దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# వందేమాతరం గౌరవం, వారసత్వాన్ని కాపాడే జాతీయ కార్యవర్గ తీర్మానం విడుదల

- **కాంగ్రెస్‌ది ఓటు బ్యాంకు రాజకీయాలు.. జాతీయ గేయం గౌరవాన్ని కాపాడాలి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** వందేమాతరం గౌరవం, వారసత్వం, జాతీయ ప్రాధాన్యతను కాపాడేందుకు బీజేపీ జాతీయ పదాధికారుల సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సోమవారం విజయవాడలో విడుదల చేశారు. వందేమాతరం భారత జాతీయ చైతన్యానికి, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి చిరస్మరణీయమైన ప్రతీక అని ఆయన పేర్కొన్నారు.

బంకించంద్ర ఛటోపాధ్యాయ రచించిన వందేమాతరం స్వదేశీ ఉద్యమ సమయంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని రగిలించిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. 2026 ఆగస్టు 19న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయంలో వందేమాతరం



గేయాన్ని కాంగ్రెస్ కార్యక్రమాల్లో మొదటి రెండు చరణాలకే పరిమితం చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. 1937లో తీసుకున్న నిర్ణయాన్ని తిరిగి సమర్థించడం మతపరమైన బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

వందేమాతరం ఏ ఒక్క మతానికో, రాజకీయ పార్టీకో చెందినది కాదని, భారతీయుల దేశభక్తి, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి ప్రతీక అని పీవీఎన్ మాధవ్ అన్నారు. జాతీయ గేయం గౌరవాన్ని ఎన్నికల లెక్కలు, మతపరమైన బేరసారాలు, ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా నిర్ణయించకూడదని పేర్కొన్నారు. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ వందేమాతరానికి జాతీయ గేయంగా గౌరవం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు.

వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ నిర్వహించడం, అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను పీవీఎన్ మాధవ్ ప్రస్తావించారు. వందేమాతరం చరిత్ర, అర్థం, జాతీయ ప్రాధాన్యత, వారసత్వాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని జాతీయ తీర్మానం పిలుపునిచ్చిందని తెలిపారు. వందేమాతరం భారత జాతీయ చైతన్యానికి చిరస్మరణీయమైన ప్రతీక అని, దాని గౌరవం, వారసత్వాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల షెడ్యూల్.. ‘ఫేక్’!

(మొదటి పేజీ తరువాయి)

కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టిస్తున్నారని, ఆ వార్తలను ప్రజలు ఏమాత్రం నమ్మవద్దని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఎన్నికల తేదీలు, షెడ్యూల్ నిజమేనా అంటూ వివరణ కోరుతూ కమిషన్ కార్యాలయానికి పెద్ద ఎత్తున ఫోన్ కాల్స్ వస్తున్నాయని అనిల్‌చంద్రపునేఠా గుర్తు చేశారు. ప్రచారంలో ఉన్న ఈ సమాచారం పూర్తిగా అవాస్తవమని, ఎలాంటి ధ్రువీకరణ లేని ఇటువంటి వార్తలను ఇతరులకు ఫార్వార్డ్ చేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సృష్టించి, ప్రజలను గందరగోళానికి గురి చేసే వారిపై సైబర్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థానిక ఎన్నికలకు సంబంధించిన ఏ విధమైన అధికారిక సమాచారమైనా కమిషన్ నేరుగా పత్రికా ప్రకటన లేదా మీడియా సమావేశం ద్వారా మాత్రమే ప్రజల దృష్టికి తీసుకువస్తుందని పునేఠా స్పష్టం చేశారు. అనధికారిక వనరులు, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చే సమాచారాన్ని అధికారికమైనదిగా పరిగణించరాదని కోరారు. తదుపరి అధికారిక ప్రకటన వెలువడే వరకు ప్రజలు ప్రజాప్రతినిధులు ధ్రువీకరించిన అధికారిక సమాచారంపైనే ఆధారపడాలని సూచించారు.

**స్థానిక పోరుకు రంగం సిద్ధం :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి.

డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టులో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్ల పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

## పోస్టల్ సేవలకు.. స్మార్ట్ టచ్!

(మొదటి పేజీ తరువాయి)

ఆధునికీకరించిన 14 పోస్టాఫీసులను ప్రారంభించారు. ఈ యాప్‌ల ద్వారా పార్సిల్ బుకింగ్, ఇంటి నుంచే పార్సిల్ పికప్, బ్యాంకింగ్, యూపీఐ, మనీ ఆర్డర్ వంటి పలు సేవలను ఒకే వేదికపై పొందే అవకాశం కల్పించారు. పోస్టల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ డిజిటల్ మార్పులు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది.

పోస్టల్ శాఖకు ఈ ఏడాది రూ.4,000 కోట్ల అదనపు ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇప్పటికే తొలి త్రైమాసికంలోనే రూ.800 కోట్ల అదనపు ఆదాయం వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా 40 పోస్టాఫీసుల ఆధునీకరణ పూర్తయిందని, మరో 110 పోస్టాఫీసులను దశలవారీగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు వెల్లడించారు. దేశంలోని మారుమూల ప్రాంతాల వరకూ పోస్టల్ సేవలను విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

## సౌజన్యపై మతమార్పిడి ఒత్తిడి!

(మొదటి పేజీ తరువాయి)

సౌజన్య స్కూటీలో రెండు సూసైడ్ నోట్‌లు దొరికాయి. మతం మారాలని సౌజన్యపై సాధిక్ ఒత్తిడి తెచ్చాడు. ఆమె మామ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పవరం పీఎస్‌లో కేసు నమోదు చేశాం. నిందితుడు సాధిక్‌ఖాన్ కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 10 పోలీసు బృందాలతో ఐదు రాష్ట్రాల్లో గాలింపు చేపట్టాం. చివరికి యూపీలోని మేరఠ్‌లో అతడి ఆచూకీ గుర్తించి అరెస్ట్ చేశాం. స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారంట్‌పై కాకినాడ తీసుకొచ్చాం.

నూకరాజు కుటుంబం ఆత్మహత్య తర్వాత పరారై మేరఠ్ చేరుకున్న సాధిక్.. స్నేహితులకు మాయమాటలు చెప్పి ఆశ్రయం పొందాడు. ఫోన్, డబ్బు పోయినట్లు వారికి చెప్పాడు. అతడిపై వస్తోన్న మరికొన్ని ఆరోపణలపై విచారణ జరుగుతోంది. నిర్ధారణ అయ్యాక ఆ వివరాలు వెల్లడిస్తాం. హత్య, బలవంతపు మతమార్పిడి సెక్షన్ల కింద సాధిక్‌పై కేసులు నమోదు చేశాం. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తాం. కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరతాం. కస్టడీలో ప్రశ్నిస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయి. సామూహిక ఆత్మహత్య ఘటనకు ముందు బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఇబ్బందికర పరిస్థితులు వచ్చినప్పుడు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోలీసులు అండగా ఉంటారు. క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు” అని ఎస్పీ కోరారు.

**సాధిక్‌ఖాన్‌కు 14 రోజుల రిమాండ్:** సాధిక్‌ఖాన్‌ను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం కాకినాడ సబ్‌జైలుకు సాధిక్‌ఖాన్‌ను తరలించారు.












# కూటమి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి–సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా సోమవారం తెనాలి పట్టణంలోని 33, 34 వార్డుల్లో కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం నుంచి తరలిపోయిన పరిశ్రమలను తిరిగి తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఎమ్మెల్సీ తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు చెప్పారు. వివిధ దశల్లో డీఎస్సీ నియామక ప్రక్రియను కొనసాగిస్తున్నామని, రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రైతు భరోసా, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

తల్లికి వందనం పథకం ద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.13 వేల చొప్పున జమ చేస్తున్నట్లు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఖాళీల భర్తీకి 'జాబ్ క్యాలెండర్'ను సిద్ధం చేయాలి

- 5 శాతానికి మించి ఖాళీలు ఉండకూడదు
- అధికారులకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగ ఖాళీల భర్తీకి 'జాబ్ క్యాలెండర్'ను రూపొందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలోని ఆయా శాఖల అధికారులు ఉద్యోగ ఖాళీల భర్తీ జాబ్ క్యాలెండర్ ప్రకారం జరిగేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి వెల్లడించారు. మంగళగిరి ఏపీఐఐసీలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉద్యోగ ఖాళీల భర్తీ తీరుతెన్నుల గురించి మంత్రి చర్చించారు.

ఈ సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, ఫుడ్ సేఫ్టీ డైరెక్టర్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ డ్రగ్ కంట్రోల్ అథారిటీ పరిధిలోని వివిధ కేటగిరీల్లో ఉన్న ఖాళీల గురించి అధికారుల్ని అడిగి మంత్రి వివరాల్ని తెలుసుకున్నారు. పదోన్నతులు, స్వచ్ఛంద రాజీనామా, మరణాల వల్ల ఏర్పడుతున్న ఖాళీల వివరాలను కూడా అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

అనంతరం మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... సదరు ఖాళీలపై మరోమారు పునఃసమీక్షించి అవసరాలకు తగ్గట్టు ఖచ్చితమైన లెక్కలు తీ–యాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందుకు తగ్గట్టుగానే ఖాళీల భర్తీని నిర్దిష్ట కాల వ్యవధిలో భర్తీ చేసేందుకు వీలుగా జాబ్ క్యాలెండర్‌ను రూపొందించాలని వెల్లడించారు. ఉద్యోగ ఖాళీల భర్తీ శాతాన్ని వీలైనంత త్వరలో 5 శాతానికి తీసుకురావాలని స్పష్టం చేశారు.

వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తామని ప్రకటించిన విషయాన్ని మంత్రి అధికారుల నుంచి వివరణ కోరారు. దీనిపై సదరు ఉద్యోగ సంఘం వారితో చర్చించాలని మంత్రి ఆదేశించారు.

## ఎస్.ఐ.ఆర్ గడువును సెప్టెంబర్ 10 వరకు పొడిగించాలి

- క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు అదనపు సమయం ఇవ్వాలి: బీజేపీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు విధించిన గడువును సెప్టెంబర్ 10, 2026 వరకు పొడిగించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రవ్యాప్తంగా SIR ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన సమాచార సేకరణ, పత్రాల సమర్పణ, క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు వంటి ప్రక్రియలకు మరింత సమయం అవసరమవుతోందని వారు తెలిపారు. పరిమిత గడువు కారణంగా అర్హత కలిగిన ఓటర్లు తమ పేర్ల నమోదు, తొలగింపు లేదా వివరాల సవరణకు సంబంధించిన క్లెయిమ్స్, అభ్యంతరాలను సకాలంలో దాఖలు చేసే అవకాశాన్ని కోల్పోకూడదని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో ఓటర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది ఎదుర్కొంటున్న ఆచరణాత్మక సమస్యలను కూడా ఎన్నికల సంఘం పరిగణనలోకి తీసుకోవాలని బీజేపీ నేతలు కోరారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడేలా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను సమగ్రంగా, పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలుకు అదనపు సమయం ఇవ్వడం ద్వారా అర్హులైన ఓటర్లకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

అందువల్ల క్లెయిమ్స్, అభ్యంతరాల దాఖలు గడువును సెప్టెంబర్ 10 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, భారత ఎన్నికల సంఘాన్ని కోరుతున్నట్లు నాగోతు రమేష్ నాయుడు, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తెలిపారు. సమగ్రంగా పరిశీలించిన, ఖచ్చితమైన, విశ్వసనీయమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు గడువు పొడిగింపు దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.

## ఆర్టీసీలో పదోన్నతుల ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేయాలి

- 3 వేల మంది ఉద్యోగులకు పదోన్నతుల్లో జాప్యం
- ఈ నెలలో రిటైర్ కానున్న 500 మందికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):** ప్రెసిడెన్షియల్ ఆర్డర్స్ పేరుతో ఆర్టీసీలో పదోన్నతులపై విధించిన ఫ్రీజింగ్‌ను వెంటనే ఎత్తివేసి, ఆగస్టు నెలాఖరు వం–కు పదోన్నతులు కల్పించేందుకు ప్రత్యేక అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీపిటిడి (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోవడంతో సుమారు 3,000 మంది ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఆగస్టు నెలాఖరు వరకు పదోన్నతులకు అవకాశం కల్పించేలా గడువు ఇస్తామని అంగీకరించినప్పటికీ, ప్రస్తుతం మల్టీజోన్‌లో ఉన్న ఉద్యోగులు, కారుణ్య నియామకాల పరిధిలోని వారికి మాత్రమే అవకాశాలు కల్పించడం వల్ల మిగిలిన కేటగిరీల ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని జేఏసీ నాయకులు తెలిపారు. దీనివల్ల ఆర్టీసీలో సుమారు 3,000 మంది ఉద్యోగుల పదోన్నతులు జాప్యమవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ నెలలో సుమారు 500 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, పదోన్నతికి అర్హత ఉన్న ఉద్యోగులు ఆ అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల జాప్యం కారణంగా ఉద్యోగుల సర్వీస్, ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలగకుండా తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ నెల 14న జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో అంగీకరించిన మేరకు ఆగస్టు నెలాఖరు వరకు పదోన్నతులకు ప్రత్యేక అనుమతి ఇస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పదవీ విరమణకు చేరుకున్న ఉద్యోగులకు పదోన్నతి విషయంలో అన్యాయం జరిగితే, ఆ నష్టాన్ని తర్వాత పూడ్చడం సాధ్యం కాదని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో అత్యవసరంగా స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఏపీపిటిడి (ఆర్టీసీ) ఉద్యోగ సంఘాల జేఏసీ కన్వీనర్లు వై. శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు, కో–కన్వీనర్లు పి.వి. రమణారెడ్డి, జి.వి. నరసయ్య, సి.హెచ్. సుందరయ్య, కే. సూర్యప్రకాశ్‌రావు తదితరులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## నాన్ జీఎంఓ మొక్కజొన్న వంగడాల సృష్టి వ్యవసాయ రంగ విప్లవంలో కీలక మైలురాయి



- కొత్త వంగడాన్ని ఆవిష్కరించిన గోర్మె పాప్ కార్నికా సంస్థకు పవన్ కళ్యాణ్ అభినందనలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మొక్కజొన్న సాగులో రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడులు అందించే వంగడాలను అభివృద్ధి చేసిన ఏలూరు జిల్లా, ముసునూరు గోర్మె పాప్ కార్నికా సంస్థకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. వ్యవసాయ రంగ విప్లవంలో ఈ వంగడం కీలక మైలురాయిగా పేర్కొన్నారు. గోర్మె పాప్ కార్నికా సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జన్యుపరంగా మార్పులు చెందని పాప్ కార్న్ మొక్కజొన్న వంగడాన్ని గౌరవ భారత ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, గౌరవ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవిష్కరించడం రాష్ట్ర వ్యవసాయ రంగానికి గర్వకారణమన్నారు.

ఈ పరిశోధనలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. జన్యుపరంగా మార్పులు చెందని వంగడాల అభివృద్ధి రైతులతోపాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వినూత్న ఆవిష్కరణను విజయవంతంగా రూపొందించిన గోర్మె పాప్ కార్నికా సంస్థ యాజమాన్యానికి, శాస్త్రవేత్తలకు, పరిశోధక బృందానికి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

## ఉద్యోగులకు మరో రెండేళ్లు!

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపి గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ సోమవారం జారీ చేసింది. ఈ ఏడాది జూలై నుంచి పదవీ విరమణ చేయాల్సిన గురుకులంలోని అర్హత కలిగిన బోధన, బోధనేతర సిబ్బందిని 62 ఏళ్ల వయసు వరకు కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతించిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఈ ఏడాది జూలై 2న ఆర్థిక శాఖ జారీ చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 45లోని నిబంధనలకు లోబడి అమలు కానుందని స్పష్టం చేశారు. అయితే, ఉద్యోగి ఉద్యోగ విరమణ తేదీ నుంచి తిరిగి విధుల్లోకి తీసుకునే తేదీ మధ్య కాలాన్ని 'ఉద్యోగంలో లేని కాలం'గా పరిగణిస్తారని, ఆ కాలానికి జీతం బకాయిలు చెల్లించరని, వార్షిక ఇంక్రిమెంట్లు, సీనియారిటీ, పదోన్నతులు, ఇతర సర్వీసు ప్రయోజనాలు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఉంటాయని తెలిపారు.

## ప్రత్యేక టెట్‌లో మినహాయింపులు ఇవ్వాలి

- ఇన్-సర్వీస్ ఉపాధ్యాయుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోవాలి: ఏపీటీఎఫ్

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్–సర్వీస్ ఉపాధ్యాయుల కోసం ప్రభుత్వం నిర్వహించనున్న ప్రత్యేక టెట్ నోటిఫికేషన్‌కు సంబంధించి విడుదల చేసిన మార్గదర్శకాల్లో తాము కోరిన మినహాయింపులు, మార్పులను పొందుపరచకపోవడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రత్యేక టెట్ మార్గదర్శకాలను ప్రభుత్వం పునఃపరిశీలించి ఉపాధ్యాయుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్. చిరంజీవి డిమాండ్ చేశారు.

ప్రత్యేక టెట్‌లో అర్హత మార్కులను డిపార్ట్‌మెంటల్ పరీక్షల తరహాలో అన్ని సామాజిక వర్గాలకు 40 శాతంగా నిర్ణయించాలని, ఏ సబ్జెక్టు ఉపాధ్యాయుడికి ఆ సబ్జెక్టుకు సంబంధించిన సిలబస్ నుంచే ప్రశ్నలు ఇవ్వాలని, టెట్‌ను మాన్యువల్ (ఆఫ్‌లైన్) విధానంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్, ఉమ్మడి వేదిక ఫ్యాప్టో ద్వారా పలుమార్లు ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేసినట్లు వారు తెలిపారు.

అయితే ప్రత్యేక టెట్‌కు సంబంధించిన తాజా మార్గదర్శకాల్లో ఈ మూడు ప్రధాన అంశాలకు ఎలాంటి ప్రస్తావన లేకపోవడాన్ని ఏపీటీఎఫ్ ఖండించింది. ఇన్–సర్వీస్ ఉపాధ్యాయుల పరిస్థితులు, వారి అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోకుండా మార్గదర్శకాలు జారీ చేయడం సరికాదని పేర్కొంది. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి అర్హత మార్కులను 40 శాతంగా నిర్ణయించడం, సబ్జెక్టు వారీగా సంబంధిత సిలబస్ నుంచి ప్రశ్నలు ఇవ్వడం, మాన్యువల్ విధానంలో ప్రత్యేక టెట్ నిర్వహించడం వంటి మూడు మార్పులను నోటిఫికేషన్‌లో చేర్చాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

## గోదావరి పుష్కరాలకు భారీ స్థాయిలో వైద్య సేవల ఏర్పాట్లు

- 525 ఘాట్లలో 1,110 వైద్య శిబిరాలు, 30 ఫీల్డ్ ఆసుపత్రులు
- 30,000 మందికి పైగా వైద్య సిబ్బంది మొహరింపు
- అంబులెన్స్‌ల కోసం పత్రేక గ్రీన్ కారిడార్
- ఏప్రిల్ 30, 2027 నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం
- గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి
- ఉన్నత స్థాయి సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టీకరణ




**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి పుష్కరాలు–2027ను పురస్కరించుకుని వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా భారీ ఎత్తున ఏర్పాట్లు జరగబోతున్నాయి. గత పుష్కరాల సందర్భంగా భక్తులకు వైద్య సేవల్ని అందించడంలో ఎదురైన ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికతో సిద్ధం కావాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజులపాటు జరిగే పుష్కరాలకు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు వస్తారన్న అంచనాలకు అనుగుణంగా చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. మంగళగిరి ఎపిఐఐసిలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అన్ని విభాగాల అధిపతులతో మంత్రి సోమవారంనాడు రెండు గంటల పాటు గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై క్షుణ్ణంగా చర్చించారు. ఇందులో చర్చించిన ప్రకారం వైద్య, ఆరోగ్య శాఖ తరఫున తీసుకునే చర్యలకు సుమారు 490 సివిల్ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రాథమిక స్థాయిలో రూ. 93 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ అంచనా వ్యయాన్ని తగ్గించేందుకు మరోసారి లోతుగా పున:సమీక్షించి అవసరాలకు తగ్గట్టుగా నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ నిర్మాణాలు, ఇతర ముఖ్య చర్యలపై ముఖ్యమంత్రి స్థాయిలో కూడా చర్చించాల్సి ఉంటుందని, అందుకు అధికారులు సన్నద్ధం కావాలని వెల్లడించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తయారుచేసిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్న ప్రకారం ఏర్పాట్ల ప్రతిపాదనల వివరాలిలా...!

**ఆరు జిల్లాల్లో 525 ఘాట్లు :** గత పుష్కరాల్లో 225 ఘాట్లను ఏర్పాటు చేయగా, ఈసారి మరో 300 ఘాట్లను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, కాకినాడ, పోలవరం జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయనున్నారు. ఘాట్లను భక్తుల రద్దీ ఆధారంగా మూడు కేటగిరీలుగా విభజించారు. అత్యధికంగా కోనసీమలో 175, తూర్పుగోదావరిలో 167 ఘాట్లు ఉన్నాయి.

**1,110 వైద్య శిబిరాలు :** భక్తుల ఆరోగ్య రక్షణకు 1,110 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి అదనంగా 950 ఫస్ట్ ఎయిడ్ పోస్టులు, 300 హెల్త్ పోస్టులు, 30 ఫీల్డ్ ఆసుపత్రులు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రతి ఘాట్‌లో అవసరానికి అనుగుణంగా వైద్య బృందాలు, ఆక్సిజన్, అత్యవసర పరికరాలు, స్ట్రెచర్లు, వీల్‌చైర్లు సిద్ధంగా ఉంచనున్నారు. భక్తుడికి ఘాట్ వద్ద ప్రాథమిక చికిత్స అందించి.. అవసరమైతే్రఎజ/జఎజ, అక్కడి నుంచి ఏరియా లేదా జిల్లా ఆసుపత్రి, చివరగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి/మెడికల్ కాలేజీకి తరలించేలా బహుళ అంచెల వైద్య రిఫరల్ వ్యవస్థను అమలు చేయనున్నారు.

**అంబులెన్సులకు ప్రత్యేక గ్రీన్ కారిడార్ :** గత పుష్కరాల్లో అంబులెన్సులు జనసందోహంలో చిక్కుకోవడం ప్రధాన సమస్యగా మారింది. ఈసారి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని నిర్ణయించారు. అంబులెన్సుల కోసం ప్రత్యేకంగా భౌతిక బారికేడ్లతో మార్గాలు ఏర్పాటు చేయనున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో గ్రీన్ కారిడార్‌ను అమలు చేస్తారు. మొత్తం 523 వాహనాలను రంగంలోకి దించనున్నారు. 108 అత్యవసర అంబులెన్సులు, 104 మొబైల్ హెల్త్ యూనిట్లు, మాతా–శిశు సేవలకు ప్రత్యేక వాహనాలు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఫీడర్ వాహనాలు 19 బోటు అంబులెన్సులు నడపనున్నారు.

**తాత్కాలిక ప్రాతిపదికన 30 ఫీల్డ్ ఆసుపత్రులు :** భక్తుల రద్దీ నేపథ్యంలో ఒకేసారి పెద్ద సంఖ్యలో భక్తులు గాయపడినా, అనారోగ్యానికి గురైనా చికిత్స అందించేలా 30 ఫీల్డ్ ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర తరలింపు కోసం ముందుగానే ఎవాక్యుయేషన్ ప్రణాళికలు రూపొందించి, పుష్కరాలకు ముందే పూర్తిస్థాయి మాక్ డ్రిల్స్ నిర్వహించాలని నిర్ణయించారు.

**30 వేలకు పైగా సిబ్బంది :** పుష్కరాల వైద్య సేవలకు వైద్య శాఖ అన్ని విభాగాల్లో కలిపి సుమారు 30,196 మంది అవసరమని అంచనా వేశారు. వీరిలో వైద్యులతో పాటు పారా మెడికల్ , ఇతర సిబ్బంది ఉన్నారు. అలాగే తాత్కాలిక ప్రాతిపదికన స్పెషలిస్టు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, సహాయక సిబ్బందిని జిల్లా స్థాయి సిబ్బంది, డిప్యూటేషన్, కాంట్రాక్టు నియామకాలు( సుమారు 1600) చేపట్టనున్నారు. అలాగే ఉద్యోగ విరమణ చేసిన వారి సేవల్ని, స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకొచ్చిన వారి వివరాలతో జాబితాను సిద్ధం చేయనున్నారు.

# ఉద్యమకారులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం ,గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం..

◆ తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే.. ఉద్యమకారులకు న్యాయం చేసేది కూడా కాంగ్రెస్ పార్టీనే: మైనంపల్లి





**మల్కాజ్‌గిరి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఉద్యమ కారులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరిలో ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ ఏకే మురుగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మైనంపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయినగర్ చౌరస్తా నుంచి నాయ కులు, కార్యకర్తలు, మహిళా ప్రతినిధులు భారీ ర్యాలీగా మల్కాజ్ గిరి చౌరస్తాకు చేరుకున్నారు. మైనంపల్లి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు తొమ్మిదిన్నర సంవత్సరాలు రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. కేసీఆర్ మాటలను నమ్మి తెలంగాణ కోసం 20-–25 సంవత్సరాలు నిస్వార్థంగా పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, గౌరవం లభించలేదని అన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెట్టడంపై దృష్టి పెట్టారే తప్ప ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నామినేటెడ్ పదవులు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలను తీసుకురావడానికే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు.

**ఉద్యమకారుల కోసం ప్రత్యేక కమిటీ**

2023 ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిందని మైనంపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంపై ఉన్న ఆర్థిక భారాన్ని సరిచేస్తూ, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునే దిశగా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు సరైన గౌరవం లభించడం లేదనే ఆవేదనతో పలువురు కాంగ్రెస్‌పై నమ్మకంతో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ఉద్యమకారుల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని, అర్హత ఉన్న ఉద్యమకారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో సహకరిస్తానని చెప్పారు.

**కాంగ్రెస్ హామీల అమలు**

బీఆర్ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డుల విషయంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని మైనంపల్లి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.మల్కాజ్‌గిరి కాంగ్రెస్‌లో కొత్త, పాత అనే తేడా లేకుండా పార్టీలోకి వచ్చే ఉద్యమకారులు, ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను సమానంగా గౌరవిస్తామని అన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరిలోని 16 డివిజన్లలో 16 సీట్లు గెలుచుకునే లక్ష్యంతో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**భారీగా కాంగ్రెస్‌లో చేరికలు**

కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. టి.ఎన్. కృష్ణ గౌడ్, జాగ్ మహేష్ గౌడ్, ఎల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, యోగేందర్, ఆకుల శ్రీనివాస్, ఈశ్వర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. సుమారు 2,000 మంది ఆటో యూనియన్, డీసీఎం యూనియన్ సభ్యులుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.తనతో కలిసి గతంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరూ తనకు గుర్తున్నారని మైనంపల్లి అన్నారు.

రానున్న ఎన్నికల్లో మరింత కష్టపడి పనిచేసి మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి అబ్జర్వర్ సమీర్ కౌశల్, మాజీ కార్పొరేటర్లు వై. ప్రేమ్ కుమార్, జితేంద్ర నాథ్, మల్కాజ్‌గిరి ఇంచార్జీ లక్ష్మీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీను, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్ కుమార్, పిట్టల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సమస్య పరిష్కారానికి కృషి.. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు

◆ 22-ఏ యుఎల్‌సి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని వేలాది మంది ఆస్తి యజమానులను ప్రభావితం చేసిన వక్ఫ్ బోర్డు సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి వివిధ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.దేవినగర్-–సైనిక్ నగర్‌లోని శ్రీరామాలయం కళ్యాణ మండపంలో యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ మల్కాజ్‌గిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే "మీట్ ☺ గ్రీట్" కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.10 వేల మంది ఆస్తి యజమానులకు ఉపశమనం వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన తప్పుగా నమోదైన సర్వే రికార్డుల సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఎమ్మెల్యే చేసిన కృషిని ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు అభినందించారు. ఈ చర్యలతో మల్కాజ్‌గిరిలో దాదాపు 10 వేల మంది ఆస్తి యజమానులకు ఉపశమనం లభించిందని తెలిపారు. గతంలో ఆస్తుల రిజిస్ట్రేషన్, ఇతర లావాదేవీల సమయంలో ఎదురైన ఇబ్బందులు తొలగించేందుకు ఎమ్మెల్యే చొరవ చూపారని పేర్కొన్నారు. కొన్ని ఆస్తులను తప్పుగా 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చిన అంశాన్ని కూడా అధికారులు దృష్టికి తీసుకెళ్లినందుకు కృతజ్ఞతలు తెలిపారు. యు ఎల్ సి సమస్యపైనా పోరాటం ఇటీవల 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చినట్లు పేర్కొంటున్న యు ఎల్ సి ఆస్తుల సమస్యను కూడా ఆర్‌డబ్ల్యూఏ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో సమగ్రంగా పరిశీలించి, తప్పుగా నమోదైన వివరాలను సరిచేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి స్పందిస్తూ.. 22-ఏ యు ఎల్ సి సమస్య పరిష్కారానికి చురుకుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన పత్రాలు, రికార్డుల సేకరణ, పరిశీలన జరుగుతోందని, త్వరలో పరిష్కార మార్గాన్ని కనుగొని ఆస్తి యజమానులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.సర్వే నంబర్ల వివరాలు అధికారికంగా ప్రకటించాలి, 22-ఏ జాబితాలో యు ఎల్ సి కింద ఏయే సర్వే నంబర్లు చేర్చారనే అంశంపై ప్రజల్లో స్పష్టత లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ సర్వే నంబర్ ఏ మండల పరిధిలో ఉందో, ఏ ఆస్తులు ప్రభావితమయ్యాయో తెలుసుకోవడం ఆస్తి యజమానులకు కష్టంగా మారిందన్నారు. అందువల్ల 22-ఏ జాబితాలో యు ఎల్ సి కింద చేర్చిన అన్ని సర్వే నంబర్లను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, పూర్తి వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని సూచించారు. సర్వే నంబర్ వారీగా వివరాలు అందుబాటులో ఉంటే ప్రజలు తమ ఆస్తుల పరిస్థితిని సులభంగా తెలుసుకుని సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతర కృషి మల్కాజ్‌గిరి ప్రజల సంక్షేమం, ఆస్తి సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఏలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో ప్రతినిధులు అన్నారు. వక్ఫ్ బోర్డు సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పాటు 22- ఏ యు ఎల్ సి సమస్యలపై కూడా చొరవ చూపుతున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీతారాం నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సంతోష్, సోము, రమేష్, బలరాం నగర్ కాలనీ అసోసియేషన్‌కు చెందిన కిషోర్ సింగ్, సైనిక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఆర్.కె. రాజు, నాగేశ్వరరావు, నారాయణరావు, మాతృపురి కాలనీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వర శర్మ, ఉత్తమ్ నగర్ కాలనీ జనరల్ సెక్రటరీ బెనర్జీ, రాఘవేంద్రరావు, ఆర్.కె. శ్యామల ఎన్‌క్లేవ్ సభ్యులు డి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో బంద్‌ను జయప్రదం చేయాలి

- భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు టీ మహేందర్ పిలుపు



**హైదరాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నేటి ఆటో డ్రైవర్ల రాష్ట్ర బందును జయప్రదం చేయాలని భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు టీ మహేందర్ పిలుపు నిచ్చారు. ఆదివారం అడ్డగుట్టలో జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశంలో టీ మహేందర్ అధ్యక్షుడిగా 21మంది డ్రైవర్లతో సీఐటీయూ అనుబంధ అడ్డగుట్ట భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, వారి జీవనోపాధికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, వాహనాల నిర్వహణ ఖర్చులు, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ భారాలు ఆటో డ్రైవర్లపై తీవ్ర ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయిని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు యాప్ ఆధారిత రవాణా సంస్థల పోటీ, ప్రభుత్వ నిబంధనల భారంతో ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గుతోందని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు, పెన్షన్, ప్రమాద బీమా,వాహనాలపై రుణ సౌకర్యాలు, పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఆదాయ రక్షణ కల్పించాలన్నారు. ఆర్టీసీలో ఈ ఆటో విధానాన్ని తేవాలనే ఆలోచనను విరమించుకోవాలని, సంవత్సరానికి 12వేల రూపాయలు ఇవ్వాలని, చాలాన్స్ పేరుతో ఆటో డ్రైవర్స్ ను వేధించడం ఆపాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లపై అన్యాయమైన జరిమానాలు, వేధింపులను అరికట్టాలని, అన్ని ఆటో డ్రైవర్లు ఐక్యంగా నిలిచి ఇచ్చిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని, ప్రజలు కూడా వారి న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కైలాష్, ఉపాధ్యక్షులు షబ్బీర్, అమర్, యాసీన్ సహాయ కార్యదర్శులు చిన్న, శేఖర్, భీమ్, శివ, సాయి నాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

- ఖానాపూర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



**కల్వకుర్తి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని ఖానాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు ఠాకూర్ బాలాజీ సింగ్‌తో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వారు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహోత్సవానికి ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామం సుభిక్షంగా, సంతోషంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

గ్రామాల్లోని దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలకే పరిమితం కాకుండా ప్రజల ఐక్యతకు, భక్తికి, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత శ్రీనివాస్, ఆలయ నిర్మాణ దాత గోకికార్ రమేష్, మార్కెట్ యార్డు చైర్మన్ యాట గీత నరసింహ, పార్టీ మండల అధ్యక్షుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బొజ్జ వెంకట్రాం రెడ్డి, నరసింహ, మాజీ ఎంపీటీసీ గణేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు హాజరయ్యారు.

# జోరువానలోనూ విధి ధర్మం.. శభాష్ పోలీస్ సార్..

- వానలో తడుస్తూ ట్రాఫిక్ క్లియర్ పోలీసులకు ప్రజల సలాం.
- జోరువానలో జోరుగా విధులు వానను లెక్కచేయని పోలీస్ సేవ.
- వికారాబాద్ పోలీసుల సిబ్బంది సేవలకు ప్రజల సలాం...



**వికారాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరు వానను సైతం లెక్కచేయకుండా విధి నిర్వహించిన వికారాబాద్ పోలీసులకు వికారాబాద్ ప్రజల ప్రశంసలు అందుకున్నారు. జోరు వర్షం కారణంగా వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా, ఎంఆర్‌పీ వైపు కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.పరిస్థితిని గమనించిన వికారాబాద్ ఎస్సై మీనాక్షి వెంటనే పోలీస్ సిబ్బందితో కలిసి రంగంలోకి దిగారు. ఎడతెరిపి లేని వర్షంలో తడుస్తూనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఎస్సై మీనాక్షితో పాటు కానిస్టేబుల్ శ్రీకాంత్‌రెడ్డి, హోంగార్డ్ ఎల్లన్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజల సేవే గమ్యంగా విధులు నిర్వర్తించారు.ఒకవైపు భారీ వర్షం.. మరోవైపు ట్రాఫిక్ రద్దీ.. అయినా పోలీసులు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా తమ వృత్తి ధర్మాన్ని నిర్వర్తించారు. పోలీసులు అప్రమత్తంగా లేకపోతే మరింతగా ట్రాఫిక్ స్తంభించే అవకాశం ఉండటంతో, ఎస్సై మీనాక్షి చొరవతో వెంటనే ట్రాఫిక్‌ను క్లియర్ చేయడం పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలిచే పోలీసుల సేవలకు ఎలాంటి బిరుదు ఇచ్చినా తక్కువేనని వాహనదారులు చర్చించుకుంటున్నారు. జోరువాన లోనూ విధులు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పలువురు ప్రజలు అభినందించారు. సలాం పోలీస్ అంటూ ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.వర్షాన్ని లెక్కచేయకుండా ప్రజల కోసం రోడ్డుపై విధులు నిర్వహించిన ఎస్సై మీనాక్షి, పోలీస్ సిబ్బందికి వికారాబాద్ ప్రజలు సెల్యూట్ చేస్తున్నారు.

# డ్రైవర్లకు భరోసా.. సరుకు రవాణాకు ఈజెడ్ మూవ్..

- జంట నగరాల్లో రవాణా యాప్ సేవలకు శ్రీకారం..



**మల్కాజిగిరి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** సరుకు రవాణా రంగంలో సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తూ ఈజెడ్ మూవ్ సంస్థ రూపొందించిన నూతన రవాణా యాప్ సేవలు ప్రారంభమయ్యాయి. మల్కాజిగిరిలోని జ్యోతినగర్ కమ్యూనిటీ హాల్లో సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి యాప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. కస్టమర్లకు వేగవంతమైన, నాణ్యమైన సరుకు రవాణా సేవలు అందించడంతో పాటు డ్రైవర్లకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రైవర్ల రిజిస్ట్రేషన్లు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, సెప్టెంబర్ 1 నుంచి పూర్తి స్థాయి కస్టమర్ సేవలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.డ్రైవర్లపై కమీషన్ భారాన్ని తగ్గించేందుకు తక్కువ రీఛార్జ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో లభించే సర్‌చార్జ్ మొత్తం డ్రైవర్‌కే అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.అవుట్‌స్టేషన్, రాత్రి ప్రయాణాలకు డ్రైవర్లే స్వయంగా బిడ్డింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇందుకు సంస్థ ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయదన్నారు. కస్టమర్ లొకేషన్‌కు చేరుకునే మార్గంలో 4 నుంచి 10 కిలోమీటర్ల ప్రయాణం అనంతరం రైడ్ రద్దయితే, డ్రైవర్‌కు అయ్యే డీజిల్ ఖర్చును సంస్థ భరిస్తుందని వివరించారు.ఈజెడ్ మూవ్‌లో టూ-వీలర్స్, 3-వీలర్ గూడ్స్ ఆటోలు, 8, 9, 10 అడుగుల గూడ్స్ వాహనాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్యాసింజర్ వాహనాలకు ఈ సేవల్లో అనుమతి లేదని స్పష్టం చేశారు. టోల్ ఫీజులు, వర్తించే ఇతర పన్నులను కస్టమర్లే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.తొలి దశలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో సేవలు అందుబాటులోకి వస్తాయని, అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించే ప్రణాళిక ఉందని యాజమాన్యం వెల్లడించింది.కార్యక్రమంలో సబిత, విజయ్ కుమార్, మహేష్ కుమార్, ప్రవీణ్, మహేందర్తో పాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హామీలు అమలు చేయాలి

- కిషన్‌రెడ్డికి తెలంగాణ ఉద్యమకారుల వినతి
- 250 గజాల స్థలం.రూ.25 వేల పెన్షన్ ఇవ్వాలి
- ఉద్యమకారుల త్యాగాలకు ప్రభుత్వాలు గౌరవం కల్పించాలి



**సికింద్రాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకాలంలో ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేసిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధులు కోరారు.ఈ మేరకు ఆదివారం నాడు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడం,నెలకు రూ.25 వేల పెన్షన్ అందించడం,గుర్తింపు కార్డులు జారీ చేయడం వంటి హామీలను వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను ప్రస్తావించి,కాంగ్రెస్ అధిష్ఠానాన్ని, రాహుల్ గాంధీ,సోనియా గాంధీలను ప్రశ్నించి ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు.తెలంగాణ ముఖ్యమంత్రి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చేలా కేంద్రం నుంచి ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉద్యమకారుల సమస్యలపై బలంగా మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకాల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లారి అనిల్‌కుమార్,టీయూఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి.టి.యు.జె.ఎ.సి జనరల్ సెక్రటరీ మోత్కూరు మల్లేష్, ఆర్గనైజర్ సెక్రటరీ గంధం మల్లయాదయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించి,వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

# క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది

- బీఆర్ఎస్ పార్టీ యువనేత రాగ నాగరాజు గౌడ్



**బేగంపేట్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిఆర్ఎస్ పార్టీ యువ నేత, తెలంగాణ ఉద్యమకారుడు రాగ నాగరాజు గౌడ్ అన్నారు. గత కొద్ది రోజుల కింద ప్రారంభమైన పి పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్ బహుమతుల కార్యక్రమం ఆదివారం పాటిగడ్డలో జరిగింది.ఈ కార్యక్రమానికి రాగా నాగరాజుగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి ప్లేస్ లో రహమాన్ సీసీ , రనరప్ గా ముజీబ్ సీసీ లు నిలిచాయి. మొత్తం ఎనిమిది టీంలు పాల్గొనగా రెహమాన్ టీం గెలవగా ముజీబ్ టీం రనరప్ గా నిలిచింది. ఈ సందర్భంగా వారికి ప్రోత్సాహక బహుమతులను రాగా నాగరాజుగౌడ్ అందజేశారు.ఈ టోర్నమెంట్లో క్రికెట్ కిట్ ను నాగరాజు గౌడ్ స్పాన్సర్ చేశాడు. ఈ కార్యక్రమంలో సిద్ధిక్, అజార్, షరన్ ల తోపాటు క్రీడాకారులు స్థానికులు పాల్గొన్నారు.

# మేడ్చల్ గడి మైసమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్



**మేడ్చల్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ 297 డివిజన్‌లో శ్రావణ మాస బోనాల వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని మేడ్చల్ గడి మైసమ్మ అమ్మవారి బోనాల కార్యక్రమంలో ఆర్.ఆర్. ఫౌండేషన్ అధినేత,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన వినాయక్ నగర్,కింది బస్తీ,రాఘవేంద్ర కాలనీలలో పర్యటించారు.ఆయా ప్రాంతాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన పలు పలహారం బండ్లను ఆయన సందర్శించారు.స్థానిక ప్రజలను, భక్తులను కలుస్తూ అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా రామన్నగారి రాఘవేందర్ గౌడ్ మాట్లాడుతూ..తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని కొనియాడారు. అమ్మవారి కృపాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురా రోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలనిఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కటిక వినయ్, ప్రమోద్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# మందుబాబులకు మహేశ్వరం ట్రాఫిక్ పోలీసుల షాక్!

- కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద విస్తృతంగా డ్రంక్ డ్రైవ్ తనిఖీలు:16 కేసులు నమోదు
- 14 కార్లు,ఒక బైక్,ఒక ఆటో గుర్తింపు..
- మద్యం సేవించి వాహనం నడపొద్దని పోలీసుల సూచన

**కడ్తాల్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ – శ్రీశైలం 765 జాతీయ రహదారిపై మద్యం సేవించి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు.రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతో పాటు వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్ టోల్ ప్లాజా వద్ద మహేశ్వరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి విస్తృతంగా డ్రంక్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా టోల్ ప్లాజా మీదుగా ప్రయాణిస్తున్న వాహనదారులను క్షుణ్ణంగా పరిశీలించి,మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించారు.ఈ డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో 16 కేసులు నమోదు చేయగా.. 14 కార్లు, ఒక బైక్,ఒక ఆటోను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

**మద్యం మత్తులో డ్రైవింగ్.. ప్రాణాలతో చెలగాటం**

మద్యం సేవించిన తర్వాత వాహనం నడపడం వల్ల డ్రైవర్‌కు రోడ్డుపై పరిస్థితులను అంచనా వేసే సామర్థ్యం తగ్గిపోతుందని పోలీసులు తెలిపారు.దీంతో వాహనంపై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు.ఒక్కరి నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు.మద్యం సేవించి వాహనం నడిపే సమయంలో డ్రైవర్‌తో పాటు వాహనంలో ప్రయాణించే వారు,రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులు,పాదచారుల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడుతుందని పోలీసులు సూచించారు.అందువల్ల 'డ్రింక్ చేసి డ్రైవ్ చేయొద్దు' అని స్పష్టంగా హెచ్చరించారు.

**కుటుంబాల భద్రతే ముఖ్యం..**

మద్యం సేవించిన వారు వాహనం నడపకుండా కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల సహాయం తీసుకోవాలని,అవసరమైతే క్యాబ్, ఆటో వంటి ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను విని యోగించుకోవాలని పోలీసులు సూచించారు.కొద్దిసేపటి సరదా కోసం వాహనం నడిపి జీవితాంతం బాధపడే పరిస్థితి తెచ్చుకో వద్దని హెచ్చరించారు.రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,మద్యం సేవించిన తర్వాత కారు,బైక్,ఆటో ఏ వాహనాన్నీ నడపకూడదని పోలీసులు సూచించారు.



**తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి..**

కడ్తాల్ టోల్ ప్లాజా పరిసరాల్లో డ్రంక్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని మహేశ్వరం ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.మద్యం సేవించి వాహనం నడిపేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,సీటు బెల్ట్,హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు.ముఖ్యంగా మద్యం సేవించిన పరిస్థితుల్లో వాహనం నడపకుండా 'మద్యం సేవిస్తే డ్రైవింగ్‌కు దూరంగా ఉండండి.. మీ ప్రాణాలను,ఇతరుల ప్రాణాలను కాపాడండి' అని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కుటుంబ పెద్దను కోల్పోయిన వేళ.. బాధిత కుటుంబానికి దశరథ్ నాయక్

## రాములు కుటుంబానికి రూ.10 వేల తక్షణ ఆర్థిక సాయం

**కడ్తాల్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ కొండంత అండగా నిలిచింది.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన అప్పారెడ్డి పల్లి రాములు అనారోగ్యంతో బాధపడుతూ అకాల మృతి చెందారు.ఆయన మృతివార్త తెలుసుకున్న కడ్తాల్ మాజీ జడ్పీటీసీ,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత,లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సమాచారం అందిన వెంటనే రాములు నివాసానికి చేరుకున్న దశరథ్ నాయక్,ఆనంద్‌లు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి,



భార్యాపిల్లలను ఓదార్చారు.కుటుంబ పెద్దను కోల్పోయిన బాధలో ఉన్న వారికి ధైర్యం చెప్పి,ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాములు అకాల మరణం అత్యంత బాధాకరమని అన్నారు.ఆయన కుటుంబం రోడ్డున పడకుండా,భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఆర్థికంగా, సామాజికంగా కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.అనంతరం రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ తరపున మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ రూ.5,000,మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5,000 చొప్పున మొత్తం రూ.10,000 తక్షణ ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని పరామర్శించేందుకు స్థానిక నాయకులు స్వయంగా తరలివచ్చి ఆర్థిక సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి అండగా నిలిచిన దశరథ్ నాయక్,ఆనంద్‌లను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రియ రమేష్ నాయక్,గ్రామ కమిటీ అధ్యక్షుడు మాజీ ఉపసర్పంచ్ కదారి రామకృష్ణ,వార్డు సభ్యుడు మాదారం గణేష్ గౌడ్,నాయకులు మంగళపల్లి నరసింహ,శీను,యాదయ్య,జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# తోటివారికి అండగా నిలవడమే నిజమైన సంతృప్తి

## 4వ వార్డు కౌన్సిలర్ మలోత్ శాంతి రాజు నాయక్

**మేడ్చల్ ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** తోటివారికి సహాయపడటం వల్ల కలిగే మానసిక సంతృప్తి వెలకట్టలేనిదని ఎల్లంపేట్ మున్సిపాలిటీ 4వ వార్డు రాజాబొల్లారం తండా కౌన్సిలర్ మలోత్ శాంతి రాజు అన్నారు. ఆదివారం రాజాబొల్లారం తండాలో జరిగిన వివాహ వేడుకలకు ఆమె హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తండాకు చెందిన కాట్రోత్ పద్మ, దుర్గా నాయక్ ద్వితీయ పుత్రికతో పాటు బానోత్ కమల, లింగం నాయక్ పుత్రికల వివాహ వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ మలోత్ శాంతి రాజు వధూవరులకు పెళ్లి కానుకగా రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శాంతి రాజు మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమవంతు సహకారం అందించడం ద్వారా వారి ఆనందంలో పాలుపంచుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. వివాహం ప్రతి కుటుంబానికి జీవితంలో ఎంతో ముఖ్యమైన ఘట్టమని, అలాంటి సమయంలో వారికి అండగా నిలవడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా ఆపదలో ఉన్న వారికి సహాయం చేస్తే పరస్పర సహకారం, మానవతా విలువలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కవ్వంపల్లి మహా కుటుంబం ఆత్మీయ సమ్మేళనం

## ముఖ్య అతిథిగా హాజరైన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** కవ్వంపల్లి వంశానికి చెందిన కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సుమారు 40 గ్రామాలు, తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్రలో స్థిరపడిన కవ్వంపల్లి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరై ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వివిధ ప్రాంతాల్లో నివసి స్తున్నప్పటికీ తమ మూలాలు, కుటుంబ బంధాలు ఒక్కటేననే భావనతో ఈ సమ్మేళనం నిర్వహిం చినట్లు తెలిపారు. విశిష్టత హాజరైన డాక్టర్ సంపత్ ఎండి మాట్లాడుతూ.కుటుంబ సభ్యులు పరస్పరం పరిచయాలు పెంచుకుని, విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర అంశాల్లో ఒకరికొకరు సహకరించు కోవాలని తెలిపారు అనంతరం నిర్వాహకులు కోఆర్డినేటర్ కవ్వంపల్లిభూమేష్ మాట్లాడుతూ ఉన్నతమైన స్థానాల్లో వివిధ రంగాల్లో రాణించిన వాళ్ళు కింద స్థాయిలో ఉన్న వారికి సహాయం చేస్తూ భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని, వంశ చరిత్ర, కుటుంబ బంధాలను పరిచయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.కార్యక్రమంలో కవ్వంపల్లి భూమేష్ (కో–ఆర్డినేటర్), కనుక రాజు, మల్లేశం,వేణు కుమార్, సంపత్, శేఖర్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఈఓ అశోక్ ప్రోత్సాహం సర్పంచ్ పద్మ సంజీవరెడ్డి సహకారం

- ఉపాధ్యాయుల కృషికి ఫలితం
నాడు 15 నేడు 77 మంది విద్యార్థులు
- ప్రభుత్వ బడిపై తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం



**వికారాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** ఒకప్పుడు కేవలం 15 మంది విద్యార్థులతో కొనసాగిన పిల్లిగుండ్ల ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 77కు చేరింది. ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మొహసిన్ ప్రత్యేక చొరవ, ఉపాధ్యాయుల కృషి, ఎంఈఓ అశోక్ ప్రోత్సాహం, గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్‌రెడ్డి సహకారంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.2024 జూన్‌లో ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన ఎం.డి. మొహసిన్ మండల ఎంఈఓ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ యువతతో కలిసి పిల్లిగుండ్ల పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న విద్యా అవకాశాలను వివరించారు. అంతేకాకుండా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో విద్యార్థుల సంఖ్య 15 నుంచి 25కు, అనంతరం 45కు పెరిగి ప్రస్తుతం 77కు చేరింది.విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్,సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు, తల్లిదండ్రుల సమావేశాలు, జాతీయ పర్వదినాల నిర్వహణ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు నిర్వహించిన స్నాతకోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాతల సహకారంతో విద్యార్థులకు పాఠశాల కిట్లు, ప్లేట్లు తదితర సామగ్రిని అందించారు.పాఠశాల అభివృద్ధికి మర్పల్లి ఎంఈఓ అశోక్ ప్రోత్సాహం అందించడంతో పాటు, గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్‌రెడ్డి పాఠశాలకు అవసరమైన సహకారం అందిస్తున్నారు. గ్రామంలోని యువత, తల్లిదండ్రులు, ప్రజలు సైతం పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మొహసిన్‌తో పాటు ఉపాధ్యాయులు సుప్రియ, సుందర్, అనూష విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఉపాధ్యాయుల కృషితో ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సఫియా బేగం హాజీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ కారణంగా ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం పెరిగిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న కొంతమంది విద్యార్థులను సైతం తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.15 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల ప్రస్తుతం 77 మందితో కళకళలాడుతుండటంపై ఎంఈఓ అశోక్, సర్పంచ్ పద్మ సంజీవ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మొహసిన్, ఉపాధ్యాయ బృందాన్ని తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# బోగస్ స్టాంపులతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్ట్..

- వివరాలు తెలిపిన గోషామహల్ పోలీసులు..

**హైదరాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన నమ్మకద్రోహం, ఫోర్జరీ, నకిలీ పత్రాల సృష్టి మరియు మోసం కేసులో (క్రైం నెంబర్ : 300/2026, యూ/ఎస్/ 318(4), 316(2), 336(3), 338, 340(2) ఆర్/డబ్ల్యు 3(5) బీ.ఎన్.ఎస్. ) ప్రమేయం ఉన్న ముగ్గురు నిందితులను గోషామహల్ పోలీసులు అరెస్ట్ చేశారు.

అరెస్టయిన నిందితుల వివరాలు : ఏ 1) మహమ్మద్ అక్బర్, తండ్రి: మహమ్మద్ జమీర్, నివాసం: శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి. ఏ 2) మహమ్మద్ అలీమ్, తండ్రి: మహమ్మద్ జమీర్, నివాసం: శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి.

ఏ 3) మహమ్మద్ ఖాసిమ్ పాషా, తండ్రి: మహమ్మద్ నజీర్ అహ్మద్, నివాసం: శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి. ఈ నిందితులను 22.08.2026 రాత్రి 23.00 గంటలకు అరెస్ట్ చేసి, న్యాయస్థానం ముందు హాజరుపరచడం జరిగింది.

స్వాధీనం చేసుకున్న సొత్తు : వివో వీ 27 ప్రో స్మార్ట్‌ఫోన్.. వివో వై 51 ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్.. శామ్‌సంగ్ గెలాక్సీ ఏ 36 5జీ స్మార్ట్‌ఫోన్.. జై బాబా కి – వీటీసీ – ఫైడ్ అని ఉన్న 01 సెల్ఫ్ ఇంక్ రబ్బర్ స్టాంప్.. ఘటన వివరాలు : ఈ నెల 21.08.2026న బేగంబజార్‌లోని 'వినోద్ ఇంపెక్స్' యజమాని కరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద రెగ్యులర్ కస్టమర్లుగా ఉన్న మహమ్మద్ అక్బర్, మహమ్మద్ అలీమ్‌లు "జై బాబా కి – వీటీసీ – ఫైడ్ " అనే నకిలీ రబ్బర్ స్టాంపును తయారు చేసి, బిల్లులు చెల్లించినట్లుగా తప్పుగా చూపిస్తూ 'వినోద్ డ్రై ఫ్రూట్స్' నుంచి సరుకును పొందుతున్నారని తెలిపారు. గత రెండున్నర నెలల కాలంలో వీరు సుమారు రూ. 24,16,450/- విలువైన సరుకును ఎలాంటి చెల్లింపులు చేయకుండా తీసుకెళ్లి, దానిని బయట అమ్ముకుని అక్రమంగా లాభపడ్డారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేసినప్పుడు ఈ మోసం బయటపడింది. యజమాని ప్రశ్నించగా, తాము చేసిన నేరాన్ని అలీమ్ ఒప్పుకుని, బకాయి కింద ఒక స్విఫ్ట్ డిజైర్ కారు మరియు ఒక టీవీని అప్పగించాడు. మిగిలిన మొత్తం రికవరీ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

దీనిపై కేసు నమోదు చేసుకున్న గోషామహల్ పోలీసులు, విశ్వసనీయ సమాచారం మేరకు 22.08.2026న దాడులు నిర్వహించి ఏ 1, ఏ 2, ఏ 3 నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేసి ఏ వీ ఐ ఏ సి జె ఎం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలు/వ్యాపారులకు విజ్ఞప్తి :** వ్యాపారులు, హోల్‌సేలర్లు,



A1) Mohd Akber S/o Mohd Zameer | A2) Mohd Aleem S/o Mohd Zameer | A3) Mohammed Khasim Pasha S/o Mohammed Nazeer Ahmed

దుకాణదారులు నకిలీ స్టాంపులు, నకిలీ బిల్లులతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గోషామహల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. సరుకును డెలివరీ చేసే ముందు డబ్బులు జమ అయ్యాయో లేదో ఖచ్చితంగా సరిచూసుకోవాలి. కేవలం స్టాంపులు లేదా చేతిరాత రసీదులను మాత్రమే నమ్మవద్దు. క్యాషియర్, బ్యాంక్ లావాదేవీలు లేదా అధికారిక రికార్డుల ద్వారా చెల్లింపులను ధృవీకరించుకోవాలి. నకిలీ స్టాంపులు లేదా అనుమానాస్పద లావాదేవీలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. నేరస్థులను చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, వెంటనే పోలీసులకు అప్పగించి చట్టపరమైన చర్యలకు సహకరించాలి.

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి:కార్తీక చంద్రారెడ్డి



**సికింద్రాబాద్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీ బలోపేతమే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లకు ఇటీవల నూతనంగా నియమితులైన బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఆదివారం తార్నాకలోని కార్తీక చంద్రారెడ్డి నివాసంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు సి.అరవింద్, నార్తలాలాగూడ డివిజన్ అధ్యక్షుడు ఎ.నటరాజ్,తార్నాక డివిజన్ అధ్యక్షుడు కె.కరుణాకర్ తదితరులను ఆమె అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కార్తీక చంద్రారెడ్డి మాట్లాడుతూ,బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు.నూతన అధ్యక్షులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాచుపల్లిలో అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలి
- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రావణమాస భోనాలను పురస్కరించుకొని ఆదివారం బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాలలో నిర్వహించిన బోనాల వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లుల దీవెనలు ప్రజలందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ శంభీ పూర్ క్రిష్ణ, మాజీ కార్పొరేటర్లు కాసాని సుధాకర్,ఆగం రాజు,గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు సలీం,చంద్రగిరి సతీష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బోనాల ఉత్సవాలలో పాల్గొన్న మహేందర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లిలో శ్రావణ మాస బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి తోపాటు పలువురు ప్రముఖులు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు కోలన్ బాల్ రెడ్డి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కోలన్ కృష్ణ రెడ్డి తదితరులు ఉన్నారు.

# బోనాల జాతర వేడుకల్లో బిజెపి నేతలు



**రాంగోపాల్ పేట్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** బన్సీలాల్ పేట్, న్యూ బోయిగూడాలలో ఆదివారం జరిగిన బోనాల జాతర వేడుకల్లో బిజెపి నేతలు పాల్గొన్నారు. మాజీమంత్రి ,బిజెపి సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి, బిజెపి యువ నాయకుడు మర్రి పురురవరెడ్డిలు వేడుకల్లో పాల్గొని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం శశిధర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పలు ఆలయాల నిర్వాహకులు, బిజెపి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# మణికొండలో ఘనంగా 'బ్రీజ్ రిహాబిలిటేషన్ సెంటర్' ప్రారంభం..



**మణికొండ, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బ్రీజ్‌రిహాబిలిటేషన్ సెంటర్‌నురాజేంద్రనగర్‌శాసనసభ్యులు ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ మానసిక స్థైర్యాన్ని, ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో రిహాబిలిటేషన్ సెంటర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం, కౌన్సెలింగ్ అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం, పునరుత్తేజాన్ని నింపాలని నిర్వా హకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ 24 క్రాఫ్ట్స్ ప్రెసిడెంట్ గంగిడి కార్తిక్ రెడ్డి, మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి తో పాటు పలువురు సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# విశాల్‌కు అండగా.. విశ్వశాంతి కుటుంబం

## పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు, విద్యార్థుల సాయం




**రాయికల్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
కూలీ పనికి వెళ్లిన ఓ యువకుడిపై ప్రమాదవశాత్తు గోడ కూలి పడటంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన రాయికల్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని ఒడ్డెర కాలనీకి చెందిన శామిల్, రాధ దంపతుల ఏకైక కుమారుడు తేళ్ల విశాల్ గత ఏడాది విశ్వశాంతి పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. దినసరి కూలీ అయిన తండ్రికి తోడుగా విశాల్ కూడా పనులకు వెళ్తుండేవాడు.
గత సోమవారం పనిలో ఉండగా ప్రమాదవశాత్తు గోడ విశాల్‌పై కూలిపడటంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.విషయం తెలుసుకున్న విశ్వశాంతి పాఠశాల యాజమాన్యం మానవతా దృక్పథంతో స్పందించింది. పాఠశాల నిర్వాహకులు మచ్చ గంగాధర్, లలిత, విశాల్ వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే 2000-01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.12 వేలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు రూ.10 వేలు సేకరించి పాఠశాల యాజమాన్యం సమక్షంలో విశాల్ కుటుంబ సభ్యులకు అందజేశారు.నిరుపేద కుటుంబానికి చెందిన విశాల్ తల్లిదండ్రులు కూలీ పనులతోనే జీవనం సాగిస్తున్నారు. భారీ వైద్య ఖర్చులు వారికి పెనుభారంగా మారడంతో కాలనీవాసులు సైతం విశాల్ చికిత్స కోసం విరాళాలు సేకరిస్తూ అండగా నిలుస్తున్నారు. విశాల్ వైద్య చికిత్సకు దాతలు, మానవతా హృదయాలు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.సహాయం చేయదలచిన వారు: 8008192221 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించవచ్చు.

# నిర్మల్ జిల్లాలో మాలల ఆందోళన - MCF జిల్లా సదస్సు




**నిర్మల్‌జిల్లా, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
నిర్మల్ జిల్లాలో జరిగినటువంటి సమావేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న SC రిజర్వేషన్ వర్గీకరణ రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని మాలా కోఆర్డినేషన్ ఫోరం – MCF రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం నిర్మల్ లోని టీఎన్జీవో భవన్ లో MCF ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా నాయకుడు మురళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గోపీనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
c రోస్టర్ పాయింట్ 22 వల్ల నష్టం: వర్గీకరణలో భాగంగా మాలలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ పాయింట్ 22 కేటాయించడం వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. c తక్షణ సవరణకు డిమాండ్: రోస్టర్ పాయింట్లను తక్షణమే సవరించాలని డిమాండ్ చేశారు. సవరించే వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం కొనసాగిస్తామన్నారు. c ఐక్య పోరాటానికి పిలుపు: మాల జాతి హక్కులు, భవిష్యత్ ప్రయోజనాల పరిరక్షణ కోసం మాలలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.
ఈ సదస్సులో MCF రాష్ట్ర నాయకులు పి. శంకర్ మాట్లాడుతూ – గత మూడు దశాబ్దాలుగా మాలలపై వివిధ ఆరోపణలు, ముద్రలు వేస్తున్నా మౌనంగా ఉండటం వల్లే చారిత్రక అన్యాయం జరిగిందని, ప్రస్తుత వర్గీకరణలో సామాజిక న్యాయం దక్కలేదని అన్నారు. నిద్రమత్తు నుంచి మేల్కొని పిల్లల భవిష్యత్తు కోసం పోరాడాలని కోరారు.
MCF రాష్ట్ర నాయకురాలు శకుంతల మాట్లాడుతూ – ఈ న్యాయమైన పోరాటంలో మహిళలను పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేయాలని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా వర్గీకరణ జరిగిందని అభిప్రాయపడ్డారు.
బత్తుల రంజిత్ మాట్లాడుతూ, జిల్లాలో మాలలు అందరూ ఐక్యంగా కలిసికట్టుగా పోరాడి రోస్టర్ విధానాన్ని . వాళ్ల వల్లకి నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు, ఈరోజు సరి విధానం అందరూ కలిసికట్టుగా ఉండి ఐక్యమొత్తంగా మన బలాన్ని చాటుదామని చాటి చెప్పారు, అంబేద్కర్ గారి ఆశయాలతో ముందుకు సాగాలని కోరారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో మాలలు పెద్ద ఎత్తులో పాల్గొని విజయవంతంగా నిర్వహించారు

# చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు ప్లే స్కూల్‌లే పునాది

## భీష్మ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి




**హయత్‌నగర్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
చిన్నారుల్లో విద్యతో పాటు సృజనాత్మకత, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడమే లక్ష్యంగా భీష్మ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌ను ప్రారంభించినట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు.హయత్‌నగర్‌లోని భాగ్యలత కమాన్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాలను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది పడేది ప్లే స్కూల్ స్థాయిలోనేనని అన్నారు. పిల్లలకు కేవలం పుస్తక పరిజ్ఞానం అందించడమే కాకుండా ఆటలు, వినోదాత్మక కార్యక్రమాలు, ఇంటరాక్టివ్ లెర్నింగ్ ద్వారా విషయాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాల్సిన అవసరం ఉందన్నారు.క్రమశిక్షణ, నిజాయితీ, దయ, ఇతరుల పట్ల గౌరవం, సహాయం చేసే మనస్తత్వం వంటి మంచి విలువలను చిన్ననాటి నుంచే పెంపొందించాలని సూచించారు.పిల్లలు ఆనందంగా నేర్చుకునే వాతావరణం కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుతో పాటు వారి మానసిక, సామాజిక, సృజనాత్మక అభివృద్ధిపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో మంచి విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం కూడా అవసరమని పేర్కొన్నారు. ప్రతి చిన్నారిలోని ప్రతిభను గుర్తించి సరైన దిశలో అభివృద్ధి చేయడంలో ఇటువంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

### విద్యను ఆనందంగా మార్చడమే లక్ష్యం

పాఠశాల నిర్వాహకుడు కోటేశ్వర్ రావు మాట్లాడుతూ చిన్నారులకు విద్యను భారంగా కాకుండా ఆనందంగా అందించాలనే ఉద్దేశంతో భీష్మ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
ప్రతి చిన్నారిలో ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని చిన్ననాటి నుంచే గుర్తించి ప్రోత్సహించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఆటలు, కథలు, సృజనాత్మక కార్యక్రమాలు, పరస్పర అభ్యాసం ద్వారా పిల్లలకు జ్ఞానాన్ని అందించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు.పిల్లల భద్రత, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల శ్రద్ధ, వారికి అందించే వాతావరణం వంటి అంశాలను తల్లిదండ్రులు పరిశీలించాలని సూచించారు. తమ పాఠశాలలో ప్రతి చిన్నారిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి, వారి వయసుకు అనుగుణంగా అభ్యాసాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పిల్లలు పాఠశాలకు రావడానికి ఇష్టపడేలా, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగేలా బోధనా విధానాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.పిల్లల్లో మంచి అలవాట్లు, మానవతా విలువలు, ఇతరుల పట్ల గౌరవం, సహానుభూతి వంటి లక్షణాలను పెంపొందించేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. తల్లిదండ్రుల సహకారంతో ప్రతి చిన్నారి ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు.భీష్మ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్‌లో ప్లే గ్రూప్, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు.
ఇంటరాక్టివ్ లెర్నింగ్, ఆటల ద్వారా అభ్యాసం, సురక్షితమైన, ప్రేమతో కూడిన వాతావరణంలో పిల్లలకు బలమైన పునాది అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అశోక్, సీఐ కాశీరాం, వనస్థలిపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చింతల రవికుమార్, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని పాఠశాల నిర్వాహకులను అభినందించారు.

# నంది హిల్స్‌లో చాయ్ బంక్ కేఫ్ ఘనంగా ప్రారంభం

## ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**మీర్‌పేట్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
మీర్‌పేట్ నంది హిల్స్ మెయిన్ రోడ్డులో నిర్వాహకులు తరుణ్, ప్రకాష్ నూతనంగా ఏర్పాటు చేసిన చాయ్ బంక్ కేఫ్ ను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ నిర్వాహకులు తరుణ్, ప్రకాష్‌లకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వ్యాపార రంగాన్ని ఎంచుకుని స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతూ నలుగురికి ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.నాణ్యమైన ఆహార పదార్థాలను సరసమైన ధరల్లో ప్రజలకు అందించి వినియోగదారుల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు.యువతలో వ్యాపార స్ఫూర్తి పెంపొందడం ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆమె పేర్కొన్నారు.అనంతరం నిర్వాహకులు తరుణ్, ప్రకాష్ మాట్లాడుతూ తమ కేఫ్‌లో నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ



సరసమైన ధరల్లో టీ, కాఫీ అందిస్తామని తెలిపారు. కాఫీ, మిల్క్‌షేక్స్, వివిధ రకాల స్నాక్స్ తమ ప్రత్యేకతలని పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఆదరణతో చాయ్ బంక్ కేఫ్‌ను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో భాస్కర్, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎస్ఐ పాఠశాల స్థలాన్ని లీజుకు ఇవ్వడం దుర్మార్గం:

## రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం అంకన్న



**కడప, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఎంతో చరిత్ర గల కడప సీఎస్ఐ ఉన్నత పాఠశా లను నిర్వీర్యం చేస్తూ ఆ స్థలాల ను దోచుకొనేందుకు చేస్తున్న ప్రయత్నలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకువాలని పీడీఎస్ యు రాష్ట్ర ఉపాధ్య క్షుడు ఎం.అంక న్న డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో పీడీఎస్ యు రాయ లసీమ ప్రాంతీయ కార్యాలయం లో మాట్లాడుతూ
మొట్ట మొదట నుండి ఈ స్థలాలు వున్నది కేవ లం విద్య, ధార్మికల కోసం మాత్ర మే కానీ వ్యాపారాల కోసం కాద న్నారు. వేలాది మంది ఇక్కడ చదువుకొని ఎంతో మంది ఉన్నత స్థానాలలో వున్నార న్నారు. కడపలోనే ఎంతో మందికి విద్యా బుద్దులు నేర్పిన ఆ స్కూల్ నేడు అన్యాక్రాం తం అవుతుండడం ఎంతో బాధాక రమన్నారు. కడప నగరంలో ఇంత దారుణం జరు గుతున్నా ప్రముఖ వ్యక్తులు ఏం చేస్తున్నా రని ప్రశ్నించారు.
కడప దేశంలోని మొత్తం సిఎస్ఐ స్కూల్ మాత్ర మే కాకుండా అక్కడ వున్న సిఎస్ఐ స్థలాలు కూడా విద్య ధార్మిక అవస రాలకు ఉపయో గించాల్సి ఉండగా ఇదే విధంగా గతంలో ప్రయివేట్ వ్యక్తులకు అప్పనంగా లీజుల పేరుతూ ఇచ్చారని వాటిలో ఇప్పుడున్న రిలయన్స్ మార్ట్, మయూర బేకరి కూడా ఉన్నాయన్నా రు.ఎంతో మందికి విద్యా ప్రధాతగా వున్నా సిఎస్ఐ పాఠశాల ఆస్తులను రాష్ట్ర ప్రభు త్వం కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్ , పీడీఎస్ యు జిల్లా నగర నాయకులు మహేశ్, దుర్గేష్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# లూసియానా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డులకు


## దరఖాస్తుల ఆహ్వానం



**రాయికల్, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
సమాజంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి లూసియానా యూనివర్సిటీ (అమెరికా) ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి గౌరవ డాక్టరేట్ అవార్డులు అందించనున్నట్లు రాష్ట్ర కోఆర్డినేటర్ డా. కాయితి శంకర్ తెలిపారు. గౌరవ డాక్టరేట్‌తో పాటు డాక్టర్ భీమ్‌రావ్ ఇంటర్నేషనల్ అవార్డు, లార్డ్ బుద్ధ ఇంటర్నేషనల్ అవార్డులను సెప్టెంబర్ 6న మహారాష్ట్రలోని పుణేలో యూనివర్సిటీ అధికారుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులను 9491322556 నంబర్‌కు పంపించాలని ఆయన కోరారు.

# 48 డివిజన్ల సమస్యలు పరిష్కరించాలి

## సమ్మె నోటీసు ఇచ్చేందుకు వెనక్కి తగ్గారు: టీజీకేవీఎస్ రియాల రాజిరెడ్డి



**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం నిర్ణయించిన నేపథ్యంలో, ఎన్నికలకు ముందు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీజీకేవీఎస్ అధ్యక్షుడు మిన్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. సింగరేణిలోని 48 డివిజన్లను పరిశీలించిన అనంతరం ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు.
కార్మిక సమస్యల పరిష్కారం కోసం తమ నోటీసును ఇచ్చేందుకు ఆర్ఎల్ఎస్ సమావేశంలో మూడు దఫాల చర్చలు జరిగినా, ఎలాంటి స్పష్టమైన హామీ లభించలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 48 హామీలను అమలు చేయకుండా కేవలం మాటలకే పరిమితం చేయడం కార్మికులను నయవంచన చేయడమేనని మండిపడ్డారు.
తమ నోటీసును ఇచ్చిన తర్వాత కూడా సమస్యల పరిష్కారంపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ కార్మిక సంఘాల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొన్నారు.
“హామీలు కాదు.. హక్కులు కావాలి. మాటలు కాదు.. పరిష్కారాలు కావాలి” అని స్పష్టం చేసిన ఆయన, సింగరేణి కార్మికులు ఇకనైనా తమ హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేలా యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# కార్మిక హామీలు నెరవేర్చాలి

## తప్పుడు ప్రచారానికి స్వస్తి పలకాలి: ఎస్. వీరయ్య



**రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 24 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, హామీల అమలుపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనీస వేతనాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ తదితర సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, ఇతర హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.
గోదావరిఖనిలో ప్రతిపాదిత 100 పడకల సూపర్ స్పెషాలిటీ ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, కార్యదర్శి ఎ. ముత్యం రాజు, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి



○ క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ.. నిర్ణీత గడువులో పరిష్కరించాలి: కలెక్టర్ సాయికాంత్ వర్మ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఆశతో వచ్చే అర్జీదారుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ ఆదేశించారు. ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ నిర్వహించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని సూచించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సాయికాంత్ వర్మతో పాటు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఖాజావలి, డీపీవో సాయికుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించడమే పీజీఆర్ఎస్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ఉచిత భోజన సదుపాయాలను కల్పించింది. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, అర్జీదారులకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా పీజీఆర్ఎస్‌కు మొత్తం 535 అర్జీలు అందాయి. ఇందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 282, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో 180, గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 5, తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలో 24, గుంటూరు నగర పాలక సంస్థకు 39, ఇతర మున్సిపాలిటీల పరిధిలో 5 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో డేగ చిత్రం ప్రారంభం



○ క్లాప్ కొట్టి ప్రారంభించిన అంబిశెట్టి

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** మనిష్ గౌర్ హాలీవుడ్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'డేగ' చిత్రం సోమవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి సన్నిధి (బ్రహ్మంగారి మఠం)లో ఘనంగా ప్రారంభమైంది.

ఈ చిత్రంలో మోస్ట్ డేంజరస్ పాత్రలో చిన్ని విలన్‌గా జె ఎన్ ఆర్ హీరోయిన్ తండ్రి పాత్రలో దస్తగిరి (సిద్ధయ్యగారి మఠం) పోలీస్ ఆఫీసర్‌గా రోజా రాణి తదితరులు నటిస్తున్నారు. చిత్రానికి కెమెరా: ప్రకాష్ కర్నె, సంగీతం: అనిల్ కుమార్. నిర్మాతలుగా చందా లక్ష్మీనారాయణ, కింది బావి వెంకటేష్, మనుచరణ్ వ్యవహరిస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలను టి. రాము నిర్వహిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవంలో బ్రహ్మంగారి మఠానికి చెందిన అంబిశెట్టి వెంకటసుబ్బయ్య విలేఖరి ఉన్నారు.

చిత్రం తదుపరి షెడ్యూల్‌ను ఢిల్లీలో మూడు రోజుల పాటు చిత్రీకరించనున్నట్లు చిత్రబృందం తెలిపింది.

## కారుమూరి అరెస్టును రాజకీయ కక్షగా చిత్రీకరించడం సరికాదు

○ కులం కార్డు వెనుక అవినీతిని దాచలేరు

○ చట్టం ముందు అందరూ సమానమే: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు అరెస్టును రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆ పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

వైఎస్సార్సీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు విస్తృతంగా జరిగాయని గళ్ళా మాధవి ఆరోపించారు. లిక్కర్ విధానాలపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ ప్రజల అభిప్రాయాలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు జరుగుతోందని, చట్టపరమైన ప్రక్రియలో భాగంగానే చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కారుమూరి నాగేశ్వరరావును లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర ఆరోపణల నేపథ్యంలో ఈడీ అరెస్టు చేసిందని, కేసులో ఆయన కుటుంబ సభ్యుల ప్రమేయంపై కూడా విచారణ జరుగుతోందని తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు తిరస్కరించిందని అన్నారు.

అరెస్టును రాజకీయ కక్షగా చిత్రీకరించడం సరికాదని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టపరంగా శిక్షార్హులేనని గళ్ళా మాధవి స్పష్టం చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని కులం ఆధారంగా సమర్థించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. వైఎస్సార్సీపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును ఉపయోగిస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

లిక్కర్ విధానాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు వైఎస్సార్సీపీ నేతలు సమాధానం చెప్పాలని గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.

ప్రతి అరెస్టును రాజకీయ కక్షగా, ప్రతి దర్యాప్తును కుట్రగా చిత్రీకరించడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించలేరన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, గత ఎన్నికల తీర్పు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పారదర్శక, అవినీతి రహిత పాలనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూ, చట్టపరమైన ప్రక్రియను గౌరవించాలని వైఎస్సార్సీపీ నేతలకు సూచించారు.

## మద్యం మాఫియా డాన్ జగన్ : ఎమ్మెల్యే నసీర్

○ చట్టం ముందు అందరూ వైసీపీ అంటేనే దొంగల ముఠా

○ చట్టం ముందు అందరూ మద్యం అక్రమాలతో ప్రజల సొమ్ము దోపిడీ

○ వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** మద్యం అక్రమాల వంటి దురాగతాలతో దొంగలు ముఠా నాయకుడిగా జగన్ ఎదిగారని, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దీనికి నిదర్శనమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ విమర్శించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల విషయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరావు అరెస్టు వైసీపీకి చెంపపెట్టు అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ పత్రిక ప్రకటనలో విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మద్యం పాలసీని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని విమర్శించారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు సరుకు రవాణాలోనూ అక్రమాలలకు ఒడిట్టారన్నారు. మద్యం విక్రయాలలో ఇష్టరీతిగా వ్యవహరించి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. కల్తీ మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాటారని విమర్శించారు. గంజాయి బ్యాచ్ ని ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. ఇలాంటి నాయకులు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మద్యం అక్రమాల ద్వారా వచ్చిన డబ్బు తాడేపల్లి ప్యాలెస్ కు చేరిందని ఆరోపించారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలు పారిపోయాయని, విద్యార్థుల జీవితాలను సర్వనాశనం చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకొచ్చారని చెప్పారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశయంలో భాగంగా యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామని, గత వైసిపి పాలనలో యువత భవితను గంజాయి మత్తులో నాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీని రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టే రోజులు ముందున్నాయని చెప్పారు.

## పాదయాత్రగా బ్రహ్మంగారిమఠం చేరిన భక్తులు

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురువు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి దర్శనం కోసం పులివెందుల నియోజకవర్గం లింగాల మండలం తాతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భక్తులు పాదయాత్రగా బయలుదేరి ఆదివారం సాయంత్రం బ్రహ్మంగారిమఠానికి చేరుకున్నారు.



భక్తులు శుక్రవారం తాతి రెడ్డిపల్లి గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించి మార్గమధ్యంలో వివిధ గ్రామాల మీదుగా ప్రయాణించి బ్రహ్మంగారిమఠానికి చేరుకున్నారు. అనంతరం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం యాజమాన్యం భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మఠ ప్రాంగణంలో భక్తులు శ్రీ జై వీరబ్రహ్మ జై గోవింద నామస్మరణతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ భక్తి పాదయాత్ర కార్యక్రమానికి మఠం సిబ్బంది, స్థానిక భక్తులు సహకరించారు. ప్రతి సంవత్సరం ఇలాగే పాదయాత్రగా స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందని భక్తులు తెలిపారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన చర్యలు

○ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో పాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు, దుకాణాల సీజ్

○ ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి: గుంటూరు నగర పాలక సంస్థ

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రజారోగ్య అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, 'స్వచ్ఛ యాప్' ద్వారా తక్షణమే అపరాధ రుసుం విధించేలా చర్యలు చేపట్టినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

గత నెల రోజులుగా నగరవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సచివాలయాల పరిధిలో కరపత్రాలు పంపిణీ చేసి దుకాణదారులు, వ్యాపారులు, ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత అవగాహన కల్పించినట్లు కమిషనర్ తెలిపారు. ఇకపై దుకాణాలు, వాణిజ్య సంస్థలు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, వీధి వ్యాపారులు లేదా ప్రజలు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా, నిల్వ చేసినా, పంపిణీ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి, రెండో విడతల్లో జరిమానా విధించినప్పటికీ నిబంధనలను ఉల్లంఘిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, బెలూన్లు, జెండాలకు ఉపయోగించే ప్లాస్టిక్ పుల్లలు, క్యాండీ, ఐస్‌క్రీమ్ పుల్లలు, అలంకరణకు ఉపయోగించే థర్మాకోల్, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ట్రేలు, ఫోర్కులు, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, స్టిరర్లు, మిఠాయి డబ్బాలు, సిగరెట్ ప్యాకెట్ల చుట్టూ ఉపయోగించే ప్లాస్టిక్ ప్యాకింగ్ ఫిలిమ్స్, ప్లాస్టిక్ షీట్లు, కవర్ల వినియోగంపై నిషేధం అమల్లో ఉందని తెలిపారు. నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు వార్డు స్థాయిలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ యూనిట్లు, గోదాములు, హోల్‌సేల్ మార్కెట్లు, రిటైల్ దుకాణాలు, వీధి వ్యాపారులు, ఇతర వాణిజ్య సంస్థల్లో ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



కేంద్ర ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, 60 జీఎస్ఎం కంటే తక్కువ ఉన్న నాన్-వోవెన్ క్యారీ బ్యాగులు, 100 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్, పీవీసీ బ్యానర్ల వినియోగం నిషేధించబడిందని నగర పాలక సంస్థ అధికారులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంటూ, ప్రజారోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా పునర్వినియోగం చేసుకునే గుడ్డ సంచులు, జూట్ బ్యాగులను ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లో విలీనం చేయాలి

○ ప్రభుత్వ శాఖల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమాన వేతనాలు చెల్లించాలి.

○ ఉద్యోగ భద్రత కల్పించాలి

○ విద్యుత్ బస్సులను ప్రభుత్వమే నడపాలి: ఏఐటీయూసీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఆర్టీసీలో పనిచేస్తున్న సుమారు 8 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ శాఖల్లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీపిటిడి (ఆర్టీసీ) ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్, ఏఐటీయూసీ డిమాండ్ చేశాయి. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాలనే ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా చెల్లించాలని కోరారు. గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో సంస్థలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఉద్యోగ భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లోని స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్, డేటా ఎంట్రీ తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చెల్లించే వేతనాల ప్రకారం ఆర్టీసీలోని అన్ని కేటగిరీల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య కోరారు. కాంట్రాక్టర్ల ద్వారా కాకుండా ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ.వీ. నరసయ్య మాట్లాడుతూ కార్మికులకు అమలు చేస్తున్న థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అప్పటివరకు ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే వేతనాలు చెల్లించాలని సూచించారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నడిపే విధానాన్ని విరమించి ప్రభుత్వమే నిర్వహించాలని, హైర్ బస్, ఆన్‌కాల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నూతన రాష్ట్ర కమిటీని ఈ సమావేశంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా టి. గంగాంజనేయులు, కార్య నిర్వహణ అధ్యక్షుడిగా వేముల బాజీ, కోశాధికారిగా పి. ప్రసాద్ కుమార్, ప్రచార కార్యదర్శిగా ఏ. అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శేఖర్, ఉపాధ్యక్షులుగా మహి వర్మ, సుధీర్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులుగా మధుసూదన, అర్జున్, మహమ్మద్ అనీఫ్, సురేష్ కుమార్, జోగినాయుడు తదితరులు ఎన్నికయ్యారు. ఆర్టీసీ రిక్రూట్‌మెంట్‌లో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నూతన అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న 16 న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని కోరారు.

## ప్రతి ఫిర్యాదుకు చట్టబద్ధమైన పరిష్కారం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనం కలిగిన పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా అందే ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 180 ఫిర్యాదులను స్వీకరించారు.

ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ, ప్రతి వినతిపై నిష్పాక్షికంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్ విధానంలో సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపించి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. ఫిర్యాదు పరిష్కారం అనంతరం సంబంధిత ఫిర్యాదుదారుడికి సమాచారం అందించి, వారి అభిప్రాయాన్ని తెలుసుకున్న తర్వాతే పిటిషన్‌ను ముగించాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకుండా, అవే సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతతో, సేవాభావంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలకు ఫిర్యాదుల నమోదు, దరఖాస్తుల స్వీకరణ తదితర ప్రక్రియల్లో పోలీస్ సిబ్బంది సహకారం అందించారు. ఇదిలా ఉండగా, గుంటూరులోని అమ్మ చారిటబుల్ ట్రస్ట్, సాయినగర్ ఆధ్వర్యంలో ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ అభినందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు, వృద్ధులు, నిరుపేదలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందని పేర్కొంటూ ట్రస్ట్ ప్రతినిధులను ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీసీఎస్ డీఎస్పీ శివాజీ, పీజీఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సౌజన్య కుటుంబానికి న్యాయం జరగాలి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** సౌజన్య కుటుంబానికి న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ డిమాండ్ చేశారు. రైఫిల్ షూటింగ్ కోచ్ షేక్ సాధిక్ ఖాన్ మత మార్పిడికి ఒత్తిడి చేయడంతో పాటు సౌజన్య కుటుంబాన్ని బెదిరించి, వేధింపులకు గురిచేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సౌజన్య మృతి, ఆమె కుటుంబానికి జరిగిన నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం సున్నితంగా స్పందించాలని యామిని శర్మ అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర హోంమంత్రి అనిత ఈ ఘటనపై స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించిన ఈ ఘటనలో నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, దర్యాప్తులో నేరం రుజువైతే న్యాయస్థానం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి, వర్తించే చట్టపరమైన నిబంధనల కింద చర్యలు తీసుకోవాలని యామిని శర్మ కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు మహిళల భద్రతకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నిందితుడిపై ఉన్న ఆరోపణలు, కుటుంబ సభ్యులకు ఎదురైన వేధింపులు, బెదిరింపులపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.

సౌజన్య కుటుంబానికి జరిగిన విషాదంపై సినీ ప్రముఖులు, జర్నలిస్టులు, మహిళా సంఘాలు, మానవ హక్కుల సంస్థలు స్పందించాలని యామిని శర్మ కోరారు. బాధితురాలు ఏ మతానికి చెందిన వారైనా, మహిళలపై జరిగే వేధింపులు, హింసను ఖండించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలలకు వాచ్‌మెన్‌లను నియమించాలి

○ విలువైన పరికరాల రక్షణకు నైట్ వాచ్‌మెన్‌ల నియామకం అవసరం: ఆప్టా

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా సంస్కరణల్లో భాగంగా విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ, ఏడాది పూర్తయిన పాఠశాలలకు ఇప్పటివరకు వాచ్‌మెన్‌లను నియమించకపోవడం పట్ల ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) ఆందోళన వ్యక్తం చేసింది. అప్‌గ్రేడ్ చేసిన అన్ని పాఠశాలలకు వెంటనే నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహదీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలల్లో అధునాతన ప్యానెల్ టీవీలు, కంప్యూటర్లు, ఇతర విలువైన విద్యా పరికరాలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. వాటి భద్రత కోసం రాత్రివేళ పాఠశాలలను పర్యవేక్షించే వాచ్‌మెన్‌ల నియామకం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ విషయంపై గతంలోనే విద్యాశాఖ అధికారులకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు స్పందన రాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ అధికారులకు మరోసారి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు ఆప్టా నాయకులు తెలిపారు. లేఖ సంఖ్య 92/ఆప్టా స్టేట్/2026 ద్వారా అప్‌గ్రేడ్ చేసిన పాఠశాలలకు వాచ్‌మెన్‌లను నియమించాలని కోరినట్లు వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు పాఠశాలల్లోని విలువైన పరికరాలు, ఆస్తులకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# నేత్రదానంపై ఇంకా అవగాహన పెరగాలి : మంత్రి సత్యకుమార్

- మూడేళ్లలో 13,803 కార్నియాల సేకరణ
- గత ఐదేళ్ల సేకరణలో ఇది 75 శాతం
- 28 జిల్లాల్లో రేపటి నుంచి జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు
- విశాఖ, కర్నూలు కంటి ఆసుపత్రుల అవసరాలకు రూ.80 లక్షలతో అత్యాధునిక పరికరాలు
- వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో నేత్రదానంపై ప్రజల్లో అవగాహన క్రమంగా పెరుగుతోందని, అయితే ఇంకా మరింత విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సోమవారం మంగళగిరిలోని ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో అవగాహన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. నేత్రదానం ద్వారా కార్నియా సంబంధిత అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును అందించవచ్చని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు, జాయింట్ సెక్రటరీ రోణశీకి గోపాలకృష్ణ, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ బి.స్వరణ్ రాజ్, డైరెక్టర్ జనరల్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అరుణ్ బాబు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విష్ణువర్ధన్, నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్టు మేనేజరు విజయలక్ష్మి , జాయింట్ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మూడేళ్లలో 13,803 కార్నియాలు** : 2019-20 నుంచి 2023-24 వరకు ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 18,400 కార్నియాలను సేకరించారు. 2024-25 నుంచి 2026-27 జూలై వరకు మూడు ఆర్థిక సంవత్సరాల్లోనే 13,803 కార్నియాలు సేకరించారు. ఇది గత ఐదేళ్లలో సేకరించిన మొత్తం కార్నియాల్లో 75 శాతానికి సమానం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. సంవత్సరాల ప్రకారం పరిశీలించినప్పుడు... 2023-24లో 5,039 కార్నియాలు సేకరించగా, 2024-25లో 6,112కు చేరాయి. ఏడాదిలో 1,073 కార్నియాలు అదనంగా సేకరించడంతో 21.3 శాతం వృద్ధి నమోదైంది. 2025-26లో 5,872, 2026-27లో జూలై వరకు 1,819 కార్నియాలు సేకరించారు.

**కర్నూలు, విశాఖ కంటి ఆసుపత్రుల్లోనూ...** : కర్నూలు, విశాఖపట్నంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రుల్లో ఐ బ్యాంకుల ఏర్పాటుకు అవసరమైన అత్యాధునిక పరికరాలను రూ. 80 లక్షలతో సమకూరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. సేకరించిన కార్నియాలను అక్కడ భద్రపరిచి, అవసరమైన వారికి అమర్చేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు వైద్య సంస్థల సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా కార్నియా సేకరణ కొనసాగుతోందని చెప్పారు. బోధనాసుపత్రుల్లో వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన వారి నుంచి కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరిస్తున్నట్లు వివరించారు.

**ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో మరణించిన వారి నుంచి సేకరణ** : ముఖ్యంగా బోధనాసుపత్రుల్లో వివిధ అనారోగ్య కారణాలతో ప్రాణాలు విడిచిన వారి నుంచి కార్నియాలు సేకరిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆమోదంతో రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఎల్వీ ప్రసాద్, శంకర, పుష్పగిరి కంటి ఆసుపత్రుల ద్వారా కార్నియాల సేకరణ జరుగుతోంది. వీటిని ఐ బ్యాంకుల్లో భద్రపరచి అవసరమైన వారికి శస్త్ర చికిత్స ద్వారా కంటి వెలుగు (కెరటో ప్లాస్టి) ప్రసాదిస్తున్నారు.

రాష్ట్ర వైద్యారోగ్యశాఖతో ఒప్పందం కుదుర్చుకున్న ఎల్వీ ప్రసాద్, శంకర, పుష్పగిరి కంటి ఆసుపత్రుల సహకారంతో కార్నియాల సేకరణ జరుగుతోందని మంత్రి తెలిపారు. సేకరించిన కార్నియాలను ఐ బ్యాంకుల్లో భద్రపరిచి, అవసరమైన వారికి శస్త్రచికిత్స ద్వారా చూపును అందిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల ఆధారంగా కొనసాగుతున్న ఈ ప్రక్రియను ప్రభుత్వపరంగా కూడా అందుబాటులోకి తీసుకురావడానికి కర్నూలు, విశాఖపట్నంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రులను అత్యాధునిక పరికరాలతో సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**28 జిల్లాల్లో పక్షోత్సవాలు** : 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఆగస్టు 25 నుంచి సెప్టెంబరు 8 వరకు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో నిర్వహించనున్నారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించి శాస్త్రీయ అవగాహన కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ప్రతిజ్ఞలు, ర్యాలీలు, సదస్సులతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు చేపట్టడంతో పాటు నేత్ర వైద్య నిపుణులు, నేత్ర బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యా సంస్థల భాగస్వామ్యంతో విస్తృత ప్రచారం చేపట్టనున్నారు. ఆత్మీయులను కోల్పోయిన విషాద సమయంలోనూ నేత్రదానానికి అంగీకరిస్తున్న కుటుంబాలను మంత్రి అభినందించారు. వారి మానవతా దృక్పథం మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

## జున్ను శివరామ్ కుమార్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)**: నాజర్‌పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది జున్ను శివరామ్ కుమార్‌ను ఉమ్మడి కృష్ణా-- గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పరామర్శించారు. గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స అనంతరం సోమవారం ఆయన ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ శివరామ్ కుమార్ నివాసానికి వెళ్లారు.

ఈ సందర్భంగా ఆయన శివరామ్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోవాలని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## ఘనంగా ఫౌండర్స్ డే



- జెడ్పీ స్కూళ్ల విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కిట్స్ పంపిణీ
- కృతజ్ఞతలు తెలిపిన ప్రధానోపాధ్యాయులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్)**: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో సోమవారం ఫౌండర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ వ్యవస్థాపక కులపతి డాక్టర్ టీఆర్ పారివేందర్ 85వ పుట్టిన రోజును పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలోని 25 ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్ స్కూళ్లల్లో పదో తరగతి చదివే 1673 మంది విద్యార్థులకు ఉచితంగా ఎడ్యుకేషనల్ కిట్స్ పంపిణీ చేశారు. ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ఆవరణలో వైస్ ఛాన్సలర్ ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ లు వర్సిటీ జెండాను ఊపి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఏటా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఆగస్టు 24న ఫౌండర్స్ డే సేవా కార్యక్రమాలను నిర్వహి ంచడం ఆనవాయితీ. ఈ ఏడాది ప్రభుత్వ హైస్కూళ్లలో పదో తరగతి చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్ను, పెన్సిల్, స్కేల్, జామెంట్రీ సెట్ బాక్సు, ఎగ్జామ్ ప్యాడ్లతో కూడిన కిట్లను అందజేయాలని వర్సిటీ మేనేజ్మెంట్ నిర్ణయించింది. జులై మాసంలో రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేష్ ను కలసిన సందర్భంగా యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి సత్యనారాయణన్ విద్యార్థులకు కిట్స్ పంపిణీ గురించి ప్రస్తావించారు. వెంటనే మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. దీంతో నియోజకవర్గంలోని మంగళగిరి, దుగ్గిరాల, తాడేపల్లి ప్రాంతాల్లోని జిల్లా పరిషత్, మునిసిపల్ హైస్కూళ్ల జాబితాలను తెప్పించుకున్న యూనివర్సిటీ ఆయా స్కూళ్లలో చదివే పదో తరగతి విద్యార్థులకు కిట్స్ రెడీ చేసింది. సోమవారం వీటిని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ద్వారా ప్రభుత్వ స్కూళ్ల హెచ్ఎంలకు అందజేసింది.

**బహుముఖ ప్రజ్ఞాశీలి డాక్టర్ పారివేందర్....**

అంతర్జాతీయ స్థాయిలో ఇంజినీరింగ్ విద్యను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఎస్ఆర్ఎం వర్సిటీని స్థాపించిన మాజీ ఎంపీ డాక్టర్ టీఆర్ పారివేందర్ బహుముఖ ప్రజ్ఞాశీలిగా పేరు గడించారని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ కొనియాడారు. మంగళగిరి మండలం నిడమర్రు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు వీసీ సతీష్ ఎడ్యుకేషనల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, స్టూడెంట్స్, అఫైర్స్ విభాగం డైరెక్టర్ రేవతీ బాలక్రిష్ణన్, ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని పాల్గొన్నారు.

## అటైన్ స్మార్ట్‌తో ఎన్ఆర్ఐఐటీ అవగాహన ఒప్పందం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**: విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఆర్ఐఐటీ) అటైన్ స్మార్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ మేరకు అటైన్ స్మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డి. స్టీవెన్, ఎన్ఆర్ఐఐటీ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు సీఆర్ట్రైనింగ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్, కెరీర్‌కు అవసరమైన ఇతర నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని మెరుగైన ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అటైన్ స్మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ డి. స్టీవెన్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఐఐటీ ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇలాంటి భాగస్వామ్యాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాల మెరుగుదలకు కళాశాల తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు మాట్లాడుతూ విద్యతో పాటు ప్రాక్టికల్, కమ్యూనికేషన్, ఉద్యోగానికి అవసరమైన ఇతర నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అటైన్ స్మార్ట్‌తో కుదిరిన ఎంవోయూ విద్యార్థుల భవిష్యత్ కెరీర్‌కు మంచి అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. హెచ్ఓడీ డా. శ్రీదేవి మాట్లాడుతూ నాణ్యమైన శిక్షణ ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- ఈ నెల 28న ఏపీజేఏసీ అమరావతి రాష్ట్రస్థాయి సదస్సు
- భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు దిశానిర్దేశం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)**: ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోని ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని ఏపీజేఏసీ అమరావతి నాయకత్వం పిలుపునిచ్చింది. సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 వేల కోట్ల బకాయిలను చెల్లించడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని డిమాండ్ చేసింది. ఈ నెల 28న విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, వినతిపత్రాలు సమర్పించినా, చర్చలకు హాజరైనా ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయాలు వెలువడలేదని అన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత నెల 22న మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో జరిగిన సుదీర్ఘ చర్చలకు నెల రోజులు దాటినా నిర్ణయాలు ప్రకటించకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. జూలై 10, 11, 22 తేదీల్లో జరిగిన చర్చల అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని మంత్రివర్గ ఉపసంఘం తెలిపిందని, అయితే ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

ఉద్యోగుల సహనాన్ని ప్రభుత్వం బలహీనతగా భావించవద్దని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు అన్నారు. ఉద్యోగ సంఘాలతో అత్యున్నత స్థాయిలో చర్చలు జరిపి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తిరిగి చర్చలకు పిలుస్తామని హామీ ఇచ్చి నెల రోజులు గడిచినా స్పందన లేకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందన్నారు. ఉద్యోగులను గౌరవిస్తామని చెప్పడం మాత్రమే కాకుండా వారి సమస్యలను పరిష్కరించినప్పుడే ఆ గౌరవం చేతల్లో కనిపిస్తుందని పేర్కొన్నారు. ఏపీ ఎన్జీవో జేఏసీ, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయ జేఏసీలతో కలిసి గతంలో మాదిరిగా ఐక్య ఉద్యమ కార్యాచరణకు ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఈ ఉద్యమం కేవలం బకాయిల కోసం మాత్రమే కాదని, ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, భద్రత, భవిష్యత్తు కోసం చేపడుతున్న పోరాటమని ఏపీజేఏసీ అమరావతి స్టేట్ అసోసియేట్ చైర్మన్, ఉద్యమ కార్యాచరణ కమిటీ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరడం, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను అడగడం, సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్య హక్కులని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సంఘాల భేదాలను పక్కనపెట్టి ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 28న జరిగే రాష్ట్రస్థాయి సదస్సులో ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తామని తెలిపారు.

రాష్ట్ర సదస్సుకు జిల్లాలు, డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా ఉద్యోగులు తరలిరావాలని ఏపీజేఏసీ అమరావతి మహిళా విభాగం స్టేట్ చైర్‌పర్సన్ పి.లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి కోరారు. సమస్యలు, డిమాండ్లు, ఉద్యోగ సంఘాలు వేర్వేరుగా ఉన్నా ఉద్యోగుల ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యం ఒక్కటేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలపై నిర్ణయాలు ప్రకటించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు హెచ్చరించారు.

## కొనసాగుతున్న జూనియర్ వైద్యుల ఆందోళన



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)**: ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్రవ్యాప్త సమ్మె 15వ రోజుకు, మూడో దశ ఆందోళన 8వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన రెసిడెంట్ వైద్యులు, ఇంటర్న్‌లు గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో సోమవారం శాంతియుత నిరసన కొనసాగించారు. ఆందోళనలో భాగంగా సుమారు 15 మంది పీజీ రెసిడెంట్లు స్వచ్ఛందంగా రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఉదయం ఏపీ జూడా న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేస్తూ నిరసన ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు లేకపోవడం, ప్రస్తుత పరిస్థితులు, తదుపరి కార్యాచరణపై రెసిడెంట్లు, ఇంటర్న్‌లు పరస్పరం చర్చించుకున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ వైద్యులు, ఇంటర్న్‌లు నిరసనను కొనసాగించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా నిలబడి, శాంతియుతంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోగుల సంరక్షణలో తమకు ఎదురైన అనుభవాలు, శిక్షణ సమయంలో ఎదుర్కొంటున్న బాధ్యతలు, సవాళ్లను రెసిడెంట్లు పంచుకున్నారు. వైద్య వృత్తి పట్ల, రోగుల సంరక్షణ పట్ల తమకున్న అంకితభావాన్ని వివరిస్తూ విధుల్లో ఎదురైన స్ఫూర్తిదాయక అనుభవాలను కూడా వారు వెల్లడించారు. శాంతియుత ప్రజాస్వామ్య నిరసనకు, ప్రభుత్వంతో అర్థవంతమైన చర్చలకు ఏపీ జూడా కట్టుబడి ఉందని తెలిపారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లకు త్వరితగతిన సామరస్యపూర్వక పరిష్కారం లభించే వరకు ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## ఏఈ నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలి

- కేసులోని ఆరోపణలపై సమగ్ర, పారదర్శక దర్యాప్తు జరపాలి
- బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)**: ఏఈ నూకరాజు కుటుంబానికి సంబంధించిన ఘటన అత్యంత విషాదకరమైనదని, ఈ కేసులో వాస్తవాలను వెలికితీసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు, బాలుడి వాంగ్మూలం, నిందితుడిపై నమోదైన కేసులు, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని కోరారు.

మోసం, బ్లాక్‌మెయిల్, ఆర్థిక దోపిడీ, బెదిరింపులు, ఆస్తులపై ఒత్తిడి, బలవంతపు మతమార్పిడి ప్రయత్నం వంటి ఆరోపణలు తీవ్రమైనవని, ప్రతి అంశంపై శాస్త్రీయంగా, పారదర్శకంగా దర్యాప్తు జరగాలని జయప్రకాశ్ నారాయణ డిమాండ్ చేశారు. నిందితుడు సాదిక్ ఖాన్‌పై దర్యాప్తులో నేరాలు నిర్ధారణ అయితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అతనికి ఎవరైనా సహకరించి ఉంటే వారి పాత్రను కూడా పూర్తిగా విచారించి ఆధారాలు లభిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనలో 'లవ్ జిహాద్' కోణం ఉందంటూ కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణలను కూడా ప్రభుత్వం, పోలీసులు దర్యాప్తులో భాగంగా పరిశీలించాలని, అయితే మతపరమైన గుర్తింపు ఆధారంగా కాకుండా ఆధారాలు, సాక్ష్యాల ఆధారంగానే చట్టపరమైన చర్యలు ఉండాలని స్పష్టం చేశారు.

మహిళలు, బాలికలను లక్ష్యంగా చేసుకున్నట్లు వచ్చిన ఫిర్యాదులు, బ్లాక్‌మెయిల్, సైబర్ బెదిరింపులు, ఆర్థిక మోసాలు, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు తీసుకున్న చర్యలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర డీజీపీ, హోంమంత్రి ఈ కేసుపై స్పష్టంగా స్పందించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే మహిళలు, కుటుంబాలకు భద్రత, గోప్యత, గౌరవం కల్పించాలని, ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సైబర్ బ్లాక్‌మెయిల్, వ్యక్తిగత ఫొటోల దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు.

రాష్ట్రంలో బీజేపీ సంస్థాగత విస్తరణపై జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీ వార్డు స్థాయి నుంచి మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వరకు అన్ని స్థాయిల్లో పార్టీ పోటీకి సిద్ధమవుతోందన్నారు. మున్సిపల్ చైర్మన్, మేయర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వంటి కీలక పదవులతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక సంస్థల స్థానాలను సాధించడమే లక్ష్యంగా సంస్థాగత బలాన్ని పెంచుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమరావతి, పోలవరం, రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పరిశ్రమలు, వైద్య, మౌలిక వసతుల రంగాల్లో రాష్ట్రానికి మరింత అభివృద్ధి సాధించేలా బీజేపీ వారధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సమన్వయం చేయడం, అభివృద్ధి అవకాశాలను ప్రజలకు చేరువ చేయడం బీజేపీ బాధ్యతగా పనిచేస్తుందని తెలిపారు.

## ఉగ్రవాదం, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడిపై ఉక్కుపాదం మోపాలి

- సాదిక్ ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)**: కాకినాడకు చెందిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబ విషాద ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ సాదిక్ ఖాన్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అతడికి సహకరించిన వారి పాత్రపైనా దర్యాప్తు చేయాలని కోరారు. నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో సాదిక్ ఖాన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైన అంశాలను ప్రస్తావిస్తూ, ఈ కేసును సాధారణ ప్రేమ వ్యవహారం లేదా ఆర్థిక వివాదంగా మాత్రమే చూడకూడదని మాధవ్ అన్నారు. బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ, బలవంతపు మతమార్పిడి వంటి ఆరోపణలపై అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు, కుటుంబం రాసిన లేఖ, ఇతర ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలని కోరారు.

ప్రేమ పేరుతో మోసం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, బ్లాక్‌మెయిల్, ఆస్తుల కోసం బెదిరింపులు వంటి నేరపూరిత చర్యలు ఎక్కడ వెలుగులోకి వచ్చినా వాటిని తీవ్రంగా పరిగణించాలని మాధవ్ అన్నారు. నేరస్థుల మతం, కులం, రాజకీయ లేదా సామాజిక పలుకుబడితో సంబంధం లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకుని, అవసరమైన రక్షణ కల్పించాలని, కౌన్సెలింగ్ పేరుతో తీవ్రమైన ఆరోపణలను పక్కన పెట్టకూడదని సూచించారు. రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు సంబంధించి పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను డీజీపీ, హోంశాఖ మంత్రి ప్రజలకు వివరించాలని పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై నమోదైన ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, దర్యాప్తులు, నిందితులపై తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. బాధితుల వ్యక్తిగత గోప్యత, గౌరవాన్ని కాపాడుతూ వారికి తక్షణ సహాయం అందేలా పోలీస్ వ్యవస్థ పనిచేయాలని అన్నారు.

'లవ్ జిహాద్' పేరుతో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనలను ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాలని మాధవ్ కోరారు. పరిచయం పెంచుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం, ఆర్థికంగా దోచుకోవడం, బెదిరింపులకు పాల్పడటం, బలవంతపు మతమార్పిడికి ప్రయత్నించడం వంటి నేరపూరిత చర్యలు ఎక్కడ ఉన్నా చట్టపరంగా కఠినంగా అడ్డుకోవాలని అన్నారు. జిమ్‌లు, స్పోర్ట్స్ అకాడమీలు, సెలూన్లు, కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ తదితర ప్రాంతాల్లో మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, యువతకు సైబర్ బ్లాక్‌మెయిల్, వ్యక్తిగత ఫొటోల దుర్వినియోగం, ఆన్‌లైన్ వేధింపులపై అవగాహన కల్పించాలని సూచించారు.

కాకినాడ, పెద్దాపురం ప్రాంతాల్లో గతంలో ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్న వ్యక్తుల అరెస్టుల నేపథ్యంలో భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని మాధవ్ అన్నారు. అయితే ఏ వ్యక్తిపైనైనా ఉగ్రవాద సంబంధాల ఆరోపణలను ఆధారాలు, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే నిర్ధారించాలని స్పష్టం చేశారు. పరారీలో ఉన్న సాదిక్ ఖాన్‌ను ఢిల్లీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయని, తదుపరి దర్యాప్తు కీలకమని తెలిపారు. నూకరాజు కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీజేపీ ప్రజల తరఫున పోరాడుతుందని, నేరాలు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మతమార్పిడి, హింస వంటి అంశాలపై చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467